ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక

సంపుటం:
సంచిక:

చిత్రభాను
శ్రావణ - కార్తీకములు

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపబడును.

(Journal of the Telugu Academy.)

సంపుటము ౩౧. { చిత్రభాను. శ్రావణ—కార్తికములు. } సంచిక ౩-౪.

శ్రీకృష్ణదేవరాయలు.

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి.

సృజతు సమాజ మజః పున
రేతాదృశ సుకవిరాజ భోజానామ్ ।
భజతు త్రిలిఙ్గవచక్రీః
ప్రాచీనాచార చారుసంచారమ్।

[ముక్తతిమ్మన]

క. శ్రీ వేంకటగిరివల్లభ
సేవాపరతంత్ర హృదయ! చిన్నమదేవీ
జీవితనాయక! కవితా
ప్రావీణ్యఫణీశ! కృష్ణరాయమహీశా!

౧

శా. అహా! కృష్ణమహామహీశమణవర్యా! నీకళారక్తి, నీ
బాహుప్రశస్త్యము, నీకవిత్వరచనప్రాగ్భారసంపత్తి, నీ

బాహాపాటవయుక్తి నీరసికతావ్యాసక్తి నీకీర్తిల
క్ష్మీహేలానటనాభిరూప్యమును నిక్షేపించి తంద్రిమ్మరన్.

౨

చ. అనుపమసత్కవిత్వరచనాధికులై యెసలారు ఘంటసిం
గనయును నందిమల్లనయు గౌరవమూని ప్రభుభక్తిగల్గి, నీ
జనకుని యాశ్రితత్వమున సన్నుతులందుచునుంట వారితోఁ
జినతనమందుఁ దెల్గునుడిచిన్నెలు నేర్చితి వంచు నెంచెదన్.

3

సీ. తుంగభద్రా సముత్తుంగవీచీజాల
కలకలార్భటి శ్రుతిగల్పి యొరయ
శ్రీకాకుళాంధ్రహరిప్రశస్తాగార
ఘంటికాధ్వని మృదంగరవ మొసయ
సంగీత సాహిత్య సారజ్ఞ వాగ్దేవి
తొలిగద్దెపై నవ్వ లొలుక మెరయఁ
గవిదిక్కరీంద్ర సంఘము బళీరే యని
పొగడి శిరఃకంపముం బొనర్పఁ
భావనాంధ్ర జగత్ప్రభా ప్రాంగణమున
మానితాముక్తమాల్యదా మధురకావ్య
గాన మొనరించితివి శ్రోత్రములు విరియఁ
గవికుశీలవ! కీర్తింపఁగలనె నిన్ను?

౪

సీ. మాఱుమ్రోసినది నీ మందిరాంతరమున
షట్శాస్త్రచర్చా మచర్చికాళి
వఱ్ఱోడె నీసభాప్రగ్రీవవేదికఁ
బ్రత్యగ్రకవితా ప్రవాహవారి

రమణీయరీతి లాస్యమొనర్చె నాంధ్రభా
రతి నీమహాస్థానరంగభూమి
నీరచ్చుపట్టు వర్ణితచతుష్షష్టి క
ళాద్భుతప్రతతికి నాటపట్టు
కవివి పండితుఁడవు నృపాగ్రణివి కృతివి
మతిబృహస్పతి వఖిలసన్నుతచరిత్ర
పతివి నీరీతి రత్నమ్ము భరతధాత్రి
గర్భమునఁ బెట్టికొని రత్నగర్భయయ్యె.

౫

మ. ప్రతిభాసంపదపెంపు తెల్లముగఁ గావ్యంబుల్ బుధశ్రావ్యముల్
శతథాకల్పనభవ్యముల్ రసములానక్రియానవ్యసం
గతిగాఁ గూర్చిన సత్కవిద్విరదసంఘాతంబు భోజక్ష్మా
పతివిద్యాపరిపాక ! నీకతన విశ్వఖ్యాతి నార్జింపదే.

౬

సీ. కఠినపాషాణపాకము నేరు మెత్తురు
తల మొత్తుకొన్న నర్థమ్ముకాదు
ముప్పేట బొండలంపుం బాకమో నారి
కేడపాకమొ యేమొ చూడఁజూడ
గింజుకొన్నను నర్థమంజులత్వము లేని
కంకుష్మములు పద్యగతుల నరయఁ
దలతిక్కయస్వామ్ములఁ బెట్టి పద్యమ్ము
నాగినీయఁడు చక్కచాయ నెచట
గీ. ననుచుఁ దలకొక్కరీతి నీయద్భుతాంధ్ర
కవిత నాక్షేపణముసేయఁగడఁగి రిచట
నెవ్వరేమన్న నీకీర్తి కేమికొఱఁత
సాహితీ సమరాంగణ సార్వభౌమ.

౭

గీ. వేదముకులుండు వేంకటవిబుధ వరుఁడు
నిరవగాధశ్రమ మొనర్చి నీసుకృతికి
వ్యాఖ్య వావణించె సర్వంకషాఖ్యతోడ
నైజపాండిత్యశక్తి సంధాబ్రయుక్తి.

౮

గీ. *ముక్తితాటంకినీశ్రవోభూష లైన
నవకపుఁ జిగుళ్లు గలిగి జ్ఞానమ్ము నొసఁగు
శాక మాలర్క మీవు భక్షణ మొనర్చి
యుండు వనుకొందుఁ గృష్ణరాయోర్వరేశ!

౯

సీ. కవితాపితామహాఖ్యాకుండు పెద్దన్న
మనుచరిత్రము మృదుమధుర రచన
సంతరించి యొసంగ నంతయుఁ బరికించి
వసుచరిత్రము బోని ప్రౌఢపాక
గర్భితం బగునొక్క కావ్యమ్ము రచియింపు
మనుడు, నాముక్తమాల్యద దురాప
దార్థ గాంభీర్య ధుర్యమ్ముగా రచియించి
యొసఁగి నీచేత మహోన్నతగతి
సత్కృతుండయ్యె నను నొక్క సాకు వన్ని
నంతమాత్రన యాంధ్రభోజాభిధాన!

---

*క. ముల్లుదలకొనని నవకపుఁ
బల్లవములతోడ ముక్తిభామ చెవులకుం
బల్లేరుఁ బువ్వులగు పువు
లుల్లసిలునలర్కశాక మొందుఁగఁగఁ గొనుచున్. (ఆము. ౪-౧౯౨.)

శ్రీరామయోగి యాయన ప్రభువునకు జ్ఞానాభివృద్ధి కీశాకము నొసఁగెడి వాఁడట.

మాల్యదా గ్రంథకర్తృత్వ మహితయశము
పూర్ణముగ నీకు రాకతప్పునె మహాత్మ !

౧౦

సీ. పారిజాత ప్రసూనారాధనమ్మున
నలరించె నొకముద్దుల ప్రబంధ
మనుచరిత్ర విశేషమును జక్క నందించి
మెప్పించినాఁ డొక్కఁ గొప్పకవిత
మృదువాక్ప్రసక్తి నభ్యుదయమ్ము వెలయించి
యానంద మొనరించె నయ్యె యొకఁడు
మాహాత్మ్య మమలినవ్యాహారమునఁ బాడి
రంజించె సుకవిధూర్జటి యొకండు
శైవ వైష్ణవమత భేద భావ మేది
[1]"తనకు నంకిత మొసఁగలే"దను నమర్ష
దొఱఁగి యందఱు కవులతోఁ బరిచయించి
తనరఁ జేసితి యశము సదాతనముగ.

౧౧

క. మృగయాదివ్యసనైక
స్థగితుఁడు నృపుఁ డేడ, రసనిధానకృతిశ్రీ
ప్రగుణనిగుంభన మేదని
తగని విమర్శనము చేసెదరు బుధు లిచటన్.

---

1 పారిజాతాపహరణము:—ముక్కు తిమ్మన.
మనుచరిత్రము:—పెద్దన.
రామాభ్యుదయము:—అయ్యలరాజు రామభద్రుఁడు.
కాళహస్తిమాహాత్మ్యము:—ధూర్జటి.
పై రెండుకృతులే రాయలకంకితములు.

౧౨

సీ. రచియింపఁడే భావరసబంధురమ్ముగాఁ
కృతి నన్నెచోడ భూపతివరుండు
ప్రతిపదంబునఁ జమత్కృతి దోఁపఁ గృతులల్లి
వెలయఁడే రఘునాథవిభుతిలకుఁడు
బహుళాశ్వచరిత్రప్రబంధంబు దావెర
వెంగళాధిపతి గావింపలేదె
చవులువుట్టఁగ శుకసప్తతిప్రభృతి కా
వ్యములు కూర్పఁడె యొక్క పరివృఢుండు
వరదరాజాదు లెందఱు వర్ణనీయ
కావ్యనిర్మాణ కర్మ విఖ్యాతిగనరు
నేఁటిదా యిది మనతెల్గునాట భూమి
భర్త లసమానకృతిజాతకర్త లగుట.

౧౩

సీ. రత్నావళీముఖ రమ్యనాటకరాజి
హర్షవర్ధనుఁడు చేయుంగలేదె ?
ముంజపృథ్వీనేత భోజరాజు పరశ్శ
తగ్రంథకర్తృతావ్యగ్రుఁడయ్యె
వెలయించె సర్వజ్ఞ విభుఁడు గైర్వాణిలోఁ
గృతుల నంతర్వాణివితతి మెచ్చ
గుంఫించెను సముద్రగుప్తుండు గబ్బము
లనుమాట వినమె శాసనములోన
భరత విశ్వంభరాధిభూప్రవరులందు
నుత్తమోత్తమకృతికర్త లుండి రనుట
నాఁటిదా ? నేఁటిదా ? చిరంతనచరిత్ర
సుప్రథిత మైనదే కదా చూడఁజూడ.

౧४

ఉ. ఎన్నివిధాల నిట్లు మతియించిన 'మాల్యద' నీకృతమ్మె; పె
ద్దన్న పరిష్కరించెనని యందురు దానిని పాటపాట నో
కన్నడరాయ! దాన నిజగౌరవకీర్తుల కార్తి లేదు నీ
వున్నది యున్నయట్టులు ప్రియోక్తుల సత్యము దెల్పు మెచ్చెదన్.

౧౫

క. ఆతతకవితా ధారా
శ్రీతత్పరబుద్ధి రసవశీకృతి లక్ష్మా
పేతములు ప్రయోగంబుల
నేతఱినో కొన్నికూర్ప నేమికొఱంతయా.

౧౬

శా. [1]అవ్యుత్పత్తికృతంబు దోషమది శక్త్యాచ్ఛాదితంబై బుధ
శ్రావ్యంబే మహినా; నశక్తికృతదోషం బెందు విద్వచ్ఛ్రవ
శ్రీవ్యాఘాత మటంచు లాక్షణికవాక్సిద్ధాంతమొం డుండెగా
దే? వ్యాసక్త నవీనశక్తి హితసాహిత్య స్ఫురత్పండితా.

౧౭

శా. వినుతస్వీయకవిత్వతత్త్వకలనావిర్భూత బంహిష్ఠ కీ
ర్తి నితాంతద్యుతిబంధురీకృత ధరిత్రీక్రోడ, శ్రీకృష్ణరా
ణ్మణి! పాణౌకృతవాణి! నీచరిత సంభావించి నీసర్వశా
స్త్రనదీష్ణత్వము చిత్తవీథి ననుసంధానింతు నశ్రాంతమున్.

౧౮

శా. ఈసర్వంసహ సర్వకాలముల నెంతే ప్రోయు దోర్దండలీ
లాసంధుక్షణశిక్షితారిజనజాలా! సాహితీలోల! నీ
ప్రాశస్త్యంబది "నాస్తి విశ్వజగతీ భాండే భవత్సన్నిభో
ర్వీశో నాస్తి కవిర్బుధోఽసహి" యటం చేపారు శ్లాఘోక్తులన్.

[1] అవ్యుత్పత్తికృతో దోషశ్శక్త్యాసంవ్రియతే కవేః
యస్త్వశక్తికృతో దోషః ఝటిత్యేవావభాసతే.

౧౯

క. *'జాంబవతీపరిణయ'కా
వ్యంబు భవత్కర్తృకంబు బయలువడియె దే
శంబున నీనడుమనె భా
షాంబామ తల్లి కిది ముదావహముగదే ?

౨౦

ఆ. సంస్కృతమునఁ గృతులు సంతరించితి నని
చెప్పికొనినపలు కసిద్ధ మగునె ?
లబ్ధకృతియ సమపలక్షకం బగు నాంధ్ర
విష్ణుదేవకృతచాష్ణుహృదయ !

౨౧

సీ. అల్లసానియుఁ దిమ్మనార్యుండు ధూర్జటి
పింగళి సూరకవిప్రవేకుఁ
డయ్యలరాజు మాదయ్యగారికులుండు
రామకృష్ణుఁడు రామరాజభూష
ణాఖ్యుండు నా నెసలారినకవు లష్ట
దిగ్గజఖ్యాతి వర్ధిల్లి రనుచుఁ
జారిత్రశోధకధీరులు కొందఱు
వచియించి రదియొక్కభంగిగాఁగ

గీ. నిందు మతభేదములు నెన్నియేని గలవు
దానికై పాటుపడెఁ జరిత్రజ్ఞగణము
దిగ్గజము లెవ్వరో మాకుఁ దెలియఁజెప్పి
శాంతి కలిగింపు మోధరాకాంతరత్న !

* మదరాసు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునఁ గృష్ణరాయేంద్రుని పేరితో నీనాటకమున్నది.

నాకవిత్వంబు నిజము కర్ణాటభాష.

శ్రీనాథకవిసార్వభౌముఁడు.

విద్వాన్-వెంపరాల సూర్యనారాయణశాస్త్రి.

శ్రీనాథమహాకవి పసితనము మొదలు మరుత్తరాట్చరిత్ర, శాలివాహనసప్తశతి, నైషధకావ్యములు నిండుజవ్వనముదాఁక రచించి ప్రౌఢనిర్భరవయఃపరిపాకమున రచింపఁబూనిన భీమఖండమునం దిష్టదేవతాప్రార్థనసుకవిస్తుతి కుకవినిరాకరణములు చేసి 'నాకవిత్వంబు నిజము కర్ణాటభాష' యని చెప్పినాఁడు. భీమఖండమునకు ముంకు వెనుకలందు రచించిన యేగ్రంథమునను దనకవిత్వ మెట్టిదో చెప్పనివాఁ డిచట నేల చెప్పెను ? అనునది యించుక విమర్శింపఁదగియున్నది.

నేఁ డుపలబ్ధములగుచున్న శ్రీనాథకృతులందీ యొుక్కదానియం దుఁదక్క దేనియందును గుకవినిరాకరణమే కనఁబడదు. ఈకుకవి నిరాకరణమైనను నితరకవులవలె నేయొకపద్యముతోనో విడువక 'సాదు రేఁగినఁ దలపోలమునఁగాని నిలువ' దనినట్లు మూఁడుపద్యములు చెప్పెను. ఆప్రకరణాంతమున "ప్రౌఢి పరికింప సంస్కృతభాషయండ్రు, పలుకునుడికారమున నాంధ్రభాషయండ్రు, రెవ్వరేమన్న నండ్రుగా కేలకొఱఁత, నాకవిత్వంబు నిజము కర్ణాటభాష' అని తనకవితాస్వరూపముఁ గ్గడించెను. అప్రసక్తముగాఁ జెప్పినట్లున్న దేకాని యీపద్యమునకు ముందు వెనుకలు పరిశీలింప భీమఖండమునకుఁ బూర్వము తాను రచించిన కావ్యములను జదివిన కుకవులును, బండితంమన్యులైన వైతండికులును రచనాప్రౌఢి నరసి "సంస్కృతభాషాభూయిష్ఠతయే కాని తెలుఁగుమర్యాద శ్రీనాథకవితయందుఁ గానరా"దనియుఁ, దెలుఁగు పలుకునుడికారముగాంచి సంస్కృతపరిపాటి కానరాదనియు వితండావాదమునకు దిగఁగా వాటికిఁ గొన్ని సమాధానములు చెప్పి వాని నిగ్రహింపఁజాలకయు, గ్రహింప

కయుఁ బిడివాదమునకు సిద్ధముకాఁగాఁ దనకవితారహస్యము నిట్లు వెల్లడించెను. అల్పజ్ఞులు, గర్వితులు, శాంతిదూరులు, మత్సరశీలురునగు వైతండికులకే యియ్యది సమాధానముగాకున్న నీపద్యమున కిటఁ బ్రసక్తి యేలేదు. నాకవితయందు మీరనుకొనిన సంస్కృతభాషాప్రౌఢియుఁ గలదు. పలుకుబడికారమును గలదు. మీరెఱుంగని దింకొక రహస్యముగూడఁ గలదు. అచ్చటచ్చటఁ గర్ణాటభాషాసంప్రదాయములు గూడఁగలవు. వానిని దప్పులని మీయల్పజ్ఞతచే నిర్ణయింపక నిర్మత్సరులై పరిశీలించికొనుఁడు. అని చెప్పిన పద్యమై యుండును. అట్టి కర్ణాటభాషాసంప్రదాయములు తనకావ్యములందుఁ బెక్కుతావులందుఁ జొనిపి యాంధ్రమా? సంస్కృతమా? యని పండితులుగూడ భ్రమమొందుచుఁ బరిపరివిధములుగా విమర్శించి నిర్ణయమునకుఁ దేజాలనంతమఱుఁగుగా శ్రీనాథమహాకవి యాంధ్రవాణికి నూతనతేజస్సును గలిగించెను. అట్టి కర్ణాట సంప్రదాయములు గొన్నిచూపెదను.

ఎల్లన్ శిష్యులు.

శా. తల్లీ! యిన్నిదినాలకేనియు... నేనొకఁడనే బిక్షానకున్ వత్తునో.
యెల్లన్ శిష్యులఁగొంచు వత్తునో...భీమ ౨. ౧౨౦.

సమాసమున ద్రుతలోపము విధించుసూత్రము వివరణమున సర్వపర్యాయంబైన 'ఎల్ల' శబ్దము ద్రుతాంతావ్యయమనియు, అసమాసమున విశేష్యమునకు ముందు ప్రయోగము లేదనియుఁ జిన్నయసూరిగారు తెలిపిరి. వారీభీమఖండపద్య మెఱుంగనివారు కారు. తమ అకారాది నిఘంటువున 'ఆఁకొన్నతనము' పదమునొద్ద నిది యుదాహరించియున్నారు. బాలవ్యాకరణమునఁగాని సూత్రాంధ్రవ్యాకరణమునఁగాని యాంధ్రశబ్దానుశాసనమునఁగాని శబ్దలక్షణసంగ్రహమునఁగాని యియ్యది తప్పనికాని యొప్పనికాని యనలేదు.

తరువాత బహుజనపల్లి సీతారామాచార్యులవారు ప్రౌఢవ్యాకరణమని ప్రసిద్ధికెక్కిన తమ త్రిలింగలక్షణశేషమను వ్యాకరణమున

ద్రుతాంతమగు నీయెల్లశబ్ద మవ్యయముకాదనియు, ససమాసమున విశేష్యమునకు ముందు కనవచ్చుచున్నదనియు నీపద్యమునే చూపిరి. అహోబలపండితుఁడు, అప్పకవిమున్నగు ప్రాచీనవ్యాకర్త లెవ్వరు దీనిని స్మరించినట్లు కానరాదు. చిన్నయసూరి సీతారామాచార్యులవారలకుఁ బూర్వులగు లాక్షణికు లీప్రయోగమును జూచియుండలేదా ? చూచియున్నచో నియ్యది యవునని కాదనికాని యేల యనలేదో పరిశీలింప వలసియున్నది.

కన్నడమున ఎల్లశబ్దమునకు సంస్కృతపదముతో సమాసము కలుగునెడ నంత్యమగు అకారమునకు దీర్ఘము, వికల్పమని యావ్యాకరణములందున్నది. ప్రాచీనమగు కర్ణాటకభాషాభూషణమున "ఆత్వమెల్లస్య" సూ. ౧౪౭. వృత్తి. సమాసే పూర్వపదభూతస్య ఎల్లశబ్దస్య ఆత్వంభవతి. ఉదా:—ఎల్లారత్నంగళ్,ఎల్లాకార్యంగళ్,ఎల్లామాతుగళ్. ప్రాయోఽనువృత్త్యా క్వచిన్నభవతి. ఎల్లధనం, ఎల్లెడ"అనియుఁ దరువాతిదగు శబ్దమణిదర్పణమున సమాసప్రకరణమందు ౧౮౭ వ సూత్రముగా "క. సవనిసుగుమెల్లశబ్ద"క్కె వికల్పదె దీర్ఘవిధి మహచ్ఛబ్దక్కే, దృఢికుం మాదేశందో, పవిల్లసంస్కృతపదం పరక్కొదవలోడం. వృత్తి. ఎల్ల ఎంబ శబ్దక్కె వికల్పదె దీర్ఘవిధి సమనిసుగుం...ప్రయోగం, ఎల్లాకార్యం, ఎల్లకార్యం, ఎల్లారత్నం, ఎల్లరత్నం, ఎల్లాధనం, ఎల్లధనం, ఎల్లాపురుషర్, ఎల్లాకాంతెయర్" అనియు నున్నది. ఈ కర్ణాటసంప్రదాయము ననుసరించియే శ్రీనాథుఁడు 'ఎల్లాశిష్యు'లని ప్రయోగించియుండును. ఆపాఠము కాంచియే ప్రాచీనలాక్షణికులు మాటాడరైరి. చిన్నయసూరిగారి నిఘంటు వర్థాదులు నిర్ణీతములుగాక యసంపూర్ణముగా నుండుటచేతను తమవ్యాకరణములందెచ్చటను స్మరింపకుండుట చేతను వారియాశయము తెలియరాకున్నది ముద్రితభీమఖండమున 'ఎల్లన్ శిష్యు'లనియే కలదు. తాళపత్త్రప్రతులు సాహిత్యపరిషత్పుస్తక భాండాగారమున లేవు. పురాతనప్రతులింకను జూడవలసియున్నది. ఈరెయ్కా

చోటఁ దక్క నీ కవి యితరగ్రంథములందేని మెచ్చుటను నిట్టి ద్రుతసహితమగు ఎల్లశబ్దము విశేష్యమునకుఁబూర్వమునఁ బ్రయోగించినట్లు గానరాదు. కావున నియ్యది కన్నడభాషారహస్యముచూపి చమత్కరింపనుద్దేశించినదనుట సమంజసము. ఎల్లాశిష్యులని యీరెండుచోటనే యుండుట గాంచి "అంతామిథ్య"మున్నగు ప్రయోగములందువలె ద్రుతమునకు మాఱుగా వచ్చిన అకారమనుకొని యిటీవలి వ్రాయసగాండ్రు సవరించియుందు రనుకొనవచ్చును. ఇట్టివివాదములకుఁ దావిచ్చుచున్న కన్నడ పదములు సమాసములు నాకుఁ గానిపించినవి, ఇఁక నొకటిరెండు చూపెదను. చిత్తగింపుఁడు.

చాఱు

చాఱు శబ్దములోని చకారము అకారపరకమగుటచే దంత్యోచ్చారణముకలది కావలెను. లోకమునఁ దాలవ్యోచ్చారణము కలదు. కావున నుచ్చారణబలమునననుసరించి, చేఁద, చేట మున్నగు శబ్దముల వలెఁ దాలవ్యచకారఘటితమగు నన్నశబ్దరత్నాకరమునననుసరించి, ఇటీవల ముద్రితమయిన యితరకావ్యములందంతట 'చేరు'అని గానవచ్చుచున్నది. కాని దంత్యచకారములేని కర్ణాటభాషాసమమగుటచేత నియ్యది తాలవ్యచకారశకటరేఫయుక్తమగుటనిశ్చయము కావుననే శ్రీనాథుఁడు హరవిలాసము 2 ఆశ్వాసము 32 వ పద్యమున "చాఱులు పిండివంటలు శర్కరయుఁ దధియుఁ యథేచ్ఛగా."అని శకటరేఫప్రాసమునఁ బ్రయోగించిచూపెను. అదంతచకారఘటితమనుట విశ్రమమువలన స్పష్టము. కన్నడమున'చాఱు' శబ్దమునుగూర్చికిట్టెలునిఘంటువుననిట్లున్నది."చాఱు= సాఱు.Sap,Juice; broth. ಸಾಱು, ಸಾಱ್=ಸಾರ್. A relish in a liquid state wellseasoned sauce,broth,pepper water. కన్నడమున నిట్లుండుటఁగాంచి శ్రీనాథుఁడట్లు ప్రయోగించియుండును. మఱియు సీ. మూల్గుటెమ్ములతోడ ముదుకగాకుండంగఁ జాదుచేసినసల్ల చారుగాచి. హర. ౨-౧౨౧ లో మఱొకప్రయోగము కలదు. తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహపాఠము ననుసరించి శకటరేఫఘటితముగా 3౨

వ పద్యమున బ్ర॥ శ్రీ॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పాఠము సవరించియు ౧౨౧ వ పద్యమున సాధురేఫముతోనే యుంచుట ప్రమాదము కావచ్చును. లేక యుభయరేఫమనుకొనినారేమో తెలియదు. అనుప్రాసస్థలములందు సంస్కృతచారుశబ్దముతో నుండుటవలన నట్లనుకొనిరేమో? అనుప్రాసస్థలముల ధ్వనిసామ్యమేకాని అనుస్వారశకటరేఫములఁ బాటింపకుండుట సామాన్యము. ఈక్రిందిప్రయోగములందు ఆదంతచకారఘటితముగను లఘ్వలఘురేఫయుతముగాను 'చాఱు' శబ్దమగపడుచున్నది. వీనింబట్టి రేఫము నిర్ణయింపవీలు లేదుకాని, అకారయుక్తమనిమాత్రము చెప్పఁదగు. క. పులిచాఱువంచె నొక్కతె, పులిచాఅల చీరఁగట్టి భోక్తలకేకా, వళిచారు చంచరీకా, వళిచారుచలత్కచాళి వహీ మహీ పొగడన్. (బహులాశ్వచరిత్రము. ౪ ఆ. ౨౯ ప.)

శా. ఔరా కూరలయొప్పిదంబు...అహో చారుల్ చారులుపో,
　సెబాసు కడుమెచ్చన్వచ్చు...

గాధేయోపాఖ్యానము. (౨ ఆ. ౩౮ ప.)

గీ. చారులేకాదు బజ్జి పచ్చళ్ల తీరు పేరుకోకున్న యీతైరు సీరుమోరు.

పాంచాలీపరిణయము. ౪-౯౩

శ్రీనాథప్రయోగముఁబట్టి శకటరేఫమనుకొనుటకుఁ జూపట్టు బల మన్యమునకుఁ గానరాదు. 'చేఱు' అనుట కుచ్చారణబలమొక్కటి దక్క నిర్ధారకప్రయోగమెచ్చటను నాకుఁ గానరాలేదు. ఎచ్చటనైనను గానవచ్చుచోఁ దెలుప విజ్ఞలోకమును బ్రార్థించుచున్నాను. అందాఁక శ్రీనాథమహాకవి ననుసరించి 'చాఱు' అనునది సాధువేయనియుఁ గన్నడసంప్రదాయానుసారము తాలవ్యోచ్చారణమే న్యాయ్యమనియుమనవి.

తీఁగ.

ఇయ్యది సానుస్వారముగా "సీ తీఁగ యుయ్యెలలెక్కి తూఁగియాడుచు... ..."నిర్వచ నోత్తర రామాయణము ౮. ౩౦.

సీ. తీఁగలు కప్పురమూఁగి...దశకుమార చరిత్రము ౮. ౩౭.

మున్నగు పెక్కు ప్రాచీనకవి ప్రయోగములున్నను క. చేగానుఁగాడి

చెఱకుం, దీగెరసంబునఁ బురాఁదేల్పక కుడువఁ, నాగుఱువు......అగ
మము......

అని శ్రీనాథుఁడు నిరనుస్వారముగా వ్రాసస్థానమున వాడుటకు హేతువు కన్నడమున నిరనుస్వారమగు తీగెశబ్దముండుటయే. దానినే యిందుఁజొన్నెను. శబ్దరత్నాకరమున సబిందుకముగానే యున్నది. కాని యాయభిప్రాయమేమిదో తెలియదు. కాని చిన్నయసూరిగారు మాత్ర ము 'తీగ' సానుస్వారముగాను, నిరనుస్వారముగాను గూడఁ దమనిఘం టువున వ్రాసికొనుట సానుస్వారము కర్ణాట సమమని స్వీకరించియుందు రనుకొన నగును. ఆనిఘంటు వసంపూర్ణమగుటచే నందింతకంటె నితరా ధారము కానరాదు. ఎట్లయినను శ్రీనాథప్రయుక్తమగు 'తీగ' శబ్దము కర్ణాటసమము.

కోహళి.

సీ. పార్వతీపతికిఁ బ్రభాతభూపతి గొన్న యలరుఁ గెందమ్మి కోహళియనంగ.

ఉత్తరహరివంశము నుపష్టంభకముగానిచ్చి "మాళింగోహళి సం ఘటించినక్రియఁ మధ్యాహ్నవేళఁ మహః, కాలంబైన నభోవిభాగమున నీఁకఁగాసె బీఱెండ..." హరవిలాసము.

పద్యములోని కోహళిశబ్దము కన్నడమనియు బ్రా॥ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'గ్రంథగ్రంథులు' అను శీర్షికక్రిందివ్యాసమున వ్రాసియున్నారు.

కోహళిశబ్దము కన్నడమనుటకు షట్పదీభారతమునుండి ప్రయో గమిచ్చి "ఆచ్ఛాదనము అని కిట్టెలు చూపినయర్థము తెనుఁగులో నెఱపడ దని 'కుళ్ళా' యని యర్థము చెప్పుట యుక్తియుక్తముగానున్నది. ఉత్త రహరివంశములోని కోహళిపదమునకుఁ గిరీటమని యర్థము నెఱపడఁగల దు—పై రెండు ప్రయోగములుఁదక్కఁ దెలుఁగున నీపదము నాకిఁక నెక్కడను గానరాలేదు" అని శ్రీ శాస్త్రిగారు వ్రాసియున్నారు. అయి

నను కిట్టెలుచూపిన యాచ్ఛాదనమును నర్థమున సీక్రిందిశాసనమందొక ప్రయోగమును, వేఱర్థమున నారన సూరన రచితమగు వనమాలి విలాసమున వేఱొక ప్రయోగమును గనఁబడుచున్నవి.

విశాఖపట్టనముజిల్లా సర్వసిద్ధితాలూకా పంచధారలక్షేత్రమందలి ధర్మలింగేశ్వరాలయమందలి కళ్యాణమంటప స్తంభమువీఁదనున్న "శ్రీ శకవర్షంబులు ౧౩౪౪ అగు నేంటిశుభకృత్సంవత్సర కార్తిక కృష్ణతదీయ్యాను భానువారమునాండు శ్రీవిష్ణువర్ధనమహారాజులైన శ్రీ నరసింహదేవర చక్రవృత్తులు...... ఈ దినమందు ధర్మలింగానకు పంచవక్త్రకోహళి భంగారాసంజేయించి సమర్పించిరి" ...దక్షిణహిందూస్థానశాసనములు VI సంపుటము నెం 667 రు గల శాసనమందు లింగమునకుఁబెట్టిన అయిదుముఖములుగల బంగారుకవచము అని యర్థమగుచున్నది. కిట్టెలు చెప్పిన (Envelop, Cover) ఆచ్ఛాదనార్థమునఁ గలదు.

ఇఁక 'వనమాలి'విలాసమున బరిణమూఁత అనికాని బరిణమూఁత వంటి మఱొకవస్తువుకాని యయియుండును. చూడుఁడు.

చ. మరుఁడనునైంద్రజాలికుఁడు మానిని నీలముఖ స్తనద్వయీ,
నిరుపమకోహళీయుగళి నించి జగన్నన (?) కందుకత్రయిన్,
బరిపరిరీతులన్ మొఱఁగి పల్మరుచూపునిశైక వంచనా,
పరతజగజ్జనంబులకుఁ బంకజలోచన యేమిచెప్పుదున్.

వనమాలి విలాసము. ౩. ఆ.

ఈపద్యమున నైంద్రజాలికుఁడు చిన్నచిన్న మూఁదు గుడ్డబంతులు నల్లని ముఖభాగముగల పచ్చని బరిణమూఁతలతోఁగప్పి, లేకుండ జేయుచు మరలఁ జూపుచుఁ దన వంచనానైపుణి ప్రకటించుట దెల్పఁబడెను. బరిణమూఁతలకుబదులు పూర్వము తదాకారమై నీలముఖమగు కుళ్ళాయి లుపయోగించెడివారేమో తెలియదు. ఇట్టిప్రదర్శనములు సామాన్యముగా గోదావరిమండలమున మోళీసాయిబాబులు చేయుచుం

దురు. అందు వారు బరిణమూఁతల నుపయోగించుట నే నెఱుఁగుదును.

ఉత్తరహరివంశమందు శివునకుఁ బ్రభాతభూపతి యీయఁబట్టుకొనిన పద్మాకారశిరోవేష్టనమనికాని పద్మాకారముగల కెంపులకిరీటమని కాని చెప్పిన సమంజసముగా నుండును. కాని 'కుళ్లా'యనునది యంత సొగసుగానుండ దనుకొందును. వీనినన్నిటిఁ జూడ ఆచ్ఛాదనార్థమునుండి కవచము, కిరీటము,కుళ్ళాయి, బరిణమూఁతవంటి యాచ్ఛాదకపదార్థము అను వివిధార్థములు వచ్చినట్లు చెప్పవచ్చును. సర్వత్ర 'కుళ్ళా'యను నర్థమునే చెప్పనక్కఱలేదు. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు చూపిన 2 ప్రయోగములనుబట్టి అంతదాఁక నిర్ధారణచేసియున్నారు. నేను జూపిన యీ 2 ప్రయోగముల ననుసరించిచూడఁగాఁ బైఁ జూపినయర్థవిశేషములు కన వచ్చినవి.

ఇఁక హరవిలాసములోని కోహళిశబ్దమునకు సామాన్యమగు 'కుళ్లా'యను నర్థముగాక వనమాలివిలాసమున నున్నట్లు పై భాగ మంతయుఁ బచ్చనిరంగుగల యొకవిధమగు కుళ్లాయనిగాని పై భాగ మున నింద్రనీలమణులు పొదిగిన బంగరుకిరీటమనికాని యర్థము చెప్పఁ దగును. లేకున్న 'మహాకాలంబైన'యను విశేషణము వ్యర్థమగును. బీతెండకిరీటాకారముగాఁ బైనుండి క్రిందికి రానురాను విస్తృతిగాంచి యున్నది. మీఁద నాకాశము నల్లనిముఖభాగముగా నున్నది.అంతయుఁ గలసి కోహళిరూపముగా నున్నదని పోల్పఁబడెను.

పై ప్రయోగములన్నిటిని బట్టి కోహళిశబ్దమునకు ౧ శరీరాచ్ఛాదనము, కవచము, ౨ శిర ఆచ్ఛాదనము, కిరీటము, 3 టోపి, కుళ్లాయి, ౪ ఆచ్ఛాదకము, బరిణమున్నగువాని మూఁత అని యర్థములు కన వచ్చుచున్నవి.

ఇఁక శాసనమున 'పంచముఖకోహళి'యనియు, వనమాలివిలాసమున నిరుపమకోహళీయుగళి యనియుసంస్కృతపదఘటితసమాసమున నీకోహళీశబ్దముండుటవలన నిదియు సంస్కృత మనిపించుచున్నది. కాని

కర్ణాటభాషావ్యాకర్త లంగీకరించిన సంస్కృతప్రాతిపదికముతోఁ గన్నడపదమును, గర్ణాటభాషాప్రాతిపదికముతో సంస్కృతశబ్దమును సమసించు వైరిసమాసమనఁబడు నాంధ్రవ్యాకరణమునఁ గానరాని సమాసము. ఇందులకు శబ్దమణిదర్పణమునం దిట్లనుశాసనము గలదు.

"క. పదవిధి కన్నడకంస,
క్కృదక్కృమిల్లాద్యరిందె సందువసటెది,
ర్పుదు బిరుదావళిమోళ్కే,
ళ్పుదు పెఱవఱొళాగదిదు విరుద్ధసమాసం."

ఈకోహాళీశబ్దమును శ్రీనాథుఁడు సమాసఘటిత మొనర్పలేదు. కాని కైవార హేరాళాదికన్నడపదములు సంస్కృతపదములతో సమసింపఁజేసినవి కొన్ని కలవు. ఒకటి రెండట్టివి చూపెదను.

కైవారము:— ఈ శబ్దము శ్రీనాథమహాకవి నైషధమున, మ... మీఁకైవారదుర్భాషణంబులకుంగాని... ౭. ౮౬ లోను, కాశీఖండమున సీ. భారతీదేవి కైవారవాక్యంబులు పఠియించుచున్నది ప్రస్ఫుటముగ. ౭. ౧౭౭ లోను సంస్కృతశబ్దముతో సమసింపఁజేయుటఁగాంచి సంస్కృతపదమని శబ్దరత్నాకరమునఁ గలదు. కాని యది కర్ణాటశబ్దముగఁ గర్ణాటనిఘంటువులలోనున్నది. శ్రీనాథుఁడు సంస్కృతశబ్దముగ భ్రమపడెనని కాశీఖండపద్యము క్రింద వ్రాయఁబడియున్నది. కాని కర్ణాటభాషాసంప్రదాయమున వైరిసమాసముగాఁ బ్రయోగించియుండును. కన్నడమున నిట్టిసమాసము శాస్త్రీయము మేమగుట నా మర్యాద ననుసరింతుననినవాఁడు కావున నెఱింగియే ప్రయోగించియుండునని తలంచెదను. ఇట్టిదే మఱియొకటి.

హేరాళము:— ఇయ్యది కన్నడపదమని కన్నడనిఘంటువులలోఁ గలదు. (చూ. కిట్టెలు నిఘంటువు.) ఇట్లునె క... నపుఋణమున్, హేరాళక్రీడాసం, చాటణీరూకాంబ భక్తజనరక్షణాకై ...భీమఖండము. ౧.౧౦౦

లో సంస్కృతసమాసమున శ్రీనాథకవి ప్రయోగించియున్నాఁడు. ఇది యును భ్రమమా? వైరిపదసమాసము కవిజనాశ్రయము, ఆంధ్ర భాషాభూషణము దోషముగాఁ జెప్పినను గావ్యాలంకారచూడామణి మాత్రము సమాసప్రకరణమున గుణమనికాని దోషమనికాని పేర్కొనక స్వరూపము నిరూపించి విడిచినది. దినవెచ్చము, కంకాళతండము, విమలడిండీరఖండతండములతోడ, మున్నగుతావుల వైరిసమాసములను వాడియున్నాఁడు కాని యవ్వి సంస్కృతమని భ్రమపడిమాత్రము కాదనియుఁ గర్ణాటభాషానుసరణమే యనియు గ్రహించుట యుక్తమని మనవి. కన్నడభాషాపరిపాటి యని మనకుఁ దెలియనట్టి యింకను బెక్కు రహస్యములు శ్రీనాథునికవితయం దిమిడియున్నవని యూహింపనవకాశమున్నది. కర్ణాటభాషావిదులగు నాంధ్రపండితులింకను బరిశీలించి యారహస్యములను వెల్లడించి 'నాకవిత్వంబు నిజము కర్ణాటభాష' యను శ్రీనాథకవిసార్వభౌమునిసూక్తి సర్థవంత మొనర్తురుగాక.

రఘునాథవిజయరాఘవులు.

విద్వాన్, పాలెపు వేంకటరత్నము.

శా. రంజిల్లెం గవితాలతాంగి మనయాంధ్రత్వస్థలిన్ భారతీ
మంజీరక్వణనానుకారియయి; సమ్మానంబులం బొందె నా
"తంజావూరు"నఁ జోళనాయకసభాస్థానంబులన్ వాఙ్మణీ
మంజూషావళి, భావభూషణరుచుల్ మర్యాదగా పాడఁగా.

సీ. సంగీతసాహిత్యసరసస్రవంతికా
వాఃపూరములు పొంగి వఱద గట్టె
చిత్రకళావాస్తుశిల్పము లాంధ్రశి
ల్పుల యశశ్శ్రీకి వెలుంగు సూపె
లలితమృదంగగర్జల కానుగుణ్యంబు
గా నాట్యసుందరి గతుల మిఁగిలె
జిలిబిలి పలుకులఁ గులుకుచుఁ దెలుఁగుఁగ
బ్బపుఁగన్నె వాణికిఁ బ్రాణమయ్యె
విజయమును విలాసముఁగను వేశ్యతోడ
సచట మూర్తీభవించిన ట్లలరు నా 'వి
జయవిలాసము'లో రాజచంద్రుఁడైన
వీరరఘునాథసభ కూడు వేళలందు.

గీ. యమకమును శ్లేష బాంధవం బందఁజేయు
నేరుపుగలయ్య మా చేమకూరసుకవి
తనసభాస్థలి నలరింపఁ గనకసింహ
పీఠమునఁ దంజాపురీవిభుఁడు కీవి.

సీ. ఆంధ్రసాహితికి నవ్యవిభూషణాభమై
చవులూరఁగాఁ బల్కెఁ జాలె నెద్ది
కౌంతేయ యాదవీ కల్యాణ సత్కథా
స్పదమౌచు బుధమోద జనకమెద్ది

శ్లేషాద్యలంకార చిత్రితంబై మనో
హారశబ్ద సంస్కృతి నలరెనెద్ది
దేశ్యవిదేశ్యసూక్తి విచిత్రముల కాట
పట్టయి మనసు నాకట్టనెద్ది

గీ. యామధుర కావ్య కన్యకాహాసరుచుల
కలరి చేపట్టి రసికజనాధిపత్య
మందు మారఘునాథనాయకుని బోలు
రాజపుంగవుఁ డున్నె ధరాతలమున.

చ. విజయవిలాసమంటపిని వేదికపైఁ గొలువుండి భూపుఁడా
'విజయవిలాస'కావ్యమును వేడుకనందెకువేళ శత్రురా
డ్విజయ మొనర్చి సింహాసమవిక్రమ మొప్పఁ జెలంగువేళ, నా
"విజయుఁడె యీతఁడా"యని సవిస్మయులై కని రెల్లవారలున్.

క. చెప్పఁగద రాముచరితము
కప్పురపుంగుప్పవోలె గమగమలాడన్.
నొప్పవిరజాజిపొట్లము
విప్పినక్రియ, నతనింబోలు విభుఁడు కలిగెనే?

విజయరాఘవనాయకుఁడు :—

ఉ. తేజము శౌర్యసంపదయు ధీబలమున్ యశము న్విలాసమున్
భూజనపాలనప్రథితభూరిగుణంబు కళాభిమానమున్
వాజిమదేభముఖ్యఘనవాహనము ల్పొలుపొందుచుండ, మా
రాజవరేణ్యుఁడౌ విజయరాఘవుఁడొప్పె మహావిభూతితో?

గీ. ఆమహారాజు తనచెంత నమితమధుర
మధుర కవితావిలాస సామ్రాట్టులైన
కవివరేణ్యులు ప్రముఖులౌ గాయకులును
గొలిచియుండఁగఁ దనసభఁ గొలువుదీర్చు.

మ. స్వరశాస్త్రంబున శబ్దశాస్త్రమునఁ జంచత్పాండితీయుక్తకా
తరుణీరత్నము లెందఱెందఱో ప్రమోదం బొప్పఁ దన్గొల్వఁగా
ధరణీనాథుఁడు సాహితీసుధను నాదబ్రహ్మతాత్పర్యమున్
వరశృంగారకళాస్వరూపమును నాస్వాదించు నెల్లప్పుడున్.

శా. శృంగారామృతసింధువార్లహరికాచిల్లక్ష్మియో, సాహితీ
సంగీతాదికళావిలాస విలసత్స్వర్యామినీరత్నమో,
యంగప్రస్ఫుట నిత్యయౌవన మనోజార్ధాంగియో యన్వర్థిన్
'రంగాజీ' ప్రథితాంధ్రవారవనితారత్నంబు చెల్వొప్పెడిన్.

సీ. కమనీయముగ యక్షగాన ప్రబంధక
　　ల్పనల జాణ లేనాఁ బరఁగె నెవతె
భరతశాస్త్రజ్ఞానపాటవంబున మించు
　　తల్లినా నటియించు దంట యెవతె
వేణువీణావాయులీనవాద్యముల రా
　　ల్గరఁగ గాంధర్వంబు నెఱపు నెవతె
మదనకళలఁ గూచిమార వాత్స్యాయన
　　కథితశాస్త్రము లెల్లఁ గఱచె నెవతె

గీ. యాకళామూర్తి తన ప్రణయాధినేత్రి
గా నిరంతర రసరాజ్యగరిమఁ దేలు
విజయరాఘవు నిస్తులవిభవ మల్ల
వేయికన్నుల వానికే వెఱపుగొలిపె.

క. యువతులజడ ప్రేటులు, శా
త్రవయోధుల నిశితఖడ్గధారల ప్రేటుల్
కవివరుల కలపుపోటులు
నవనీనాథుఁడు సమానమని భరియించెన్.

గీ. పునుఁగు జవ్వాది మృగనాభి పుష్పరజము
మంచిగందము గంబూర నుంచి కవుల
కెల్లవేళల నారాజు తెల్లనాకు
విడెము లందిచ్చుఁగృతులందు వేళలందు.

గ్రంథస్వీకారము.

1. తత్సమచంద్రిక.

రచయితలు—సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు. వీరు కవులుగాను, పండితులుగాను జిరకాలమునుండి తెలుఁగుదేశమునఁ బేరు గనుచున్నారు. వీ రింతకుమున్ను 'తత్సమచంద్రిక' యను చిన్న గ్రంథమొకటి రచించి వెలువరించిరి. అది విశ్వవిద్యాలయములలోఁ బాఠ్యముగా నిర్ణయింపఁబడినది. ఆ చిన్నకృతియే సూర్యనారాయణ శాస్త్రిగారి బహుపరిశ్రమమువలన నించుమించు 500 పుటలుగల గ్రంథాకారమునకు వచ్చినది. దీనికి శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు "తొలిపలుకు" వ్రాసిరి. గ్రంథకారపీఠికాకారులకు నామైక్య మేగాక భావైక్యముకూడఁ బెక్కుచోట్లఁగలదు. "ఆంధ్రభాషానుశాసన" కర్తలగు మల్లాదిశాస్త్రిగా రీవిషయమును దొలిపలుకులో వ్రాసి యున్నారు.

ఈ తత్సమచంద్రిక "సిద్ధాంతకౌముది"కిఁ జాలభాగ మాంధ్రీకరణము. సిద్ధాంతకౌముది తెలుఁగుపఱచినవారు, తెలుఁగుపఱచు చున్నవారును నలుగురయిదుగురు కలరు. ఒకటియుఁ దుదముట్టినట్టు కనఁబడదు. వారు వ్రాసినది కేవలాంధ్రీకరణములు (మక్కికిమక్కిగా వ్రాసినవి) గాని యీ తత్సమచంద్రికవంటివి గావు. ఇందు సంధి, కృదంత, తద్ధిత, స్త్రీప్రత్యయ, సమాసప్రకరణములును, రూపభేద, లౌకికన్యాయప్రకరణములును గలవు. సందర్భానుసారముగాఁ దెలుఁగు కావ్యములనుండి ప్రయోగముల నేరి యిచ్చియుండిరి. అది చక్కని క్రొత్తమార్గము. 'సిద్ధాంతకౌముది' చదువనివారి కిది చాల నుపయోగ పడఁగలదు.

తెలుఁగుభాషకు సమగ్రమైనవ్యాకరణ మింతవఱకు రచియింపఁబడ లేదనియు, సంపూర్ణమైనవ్యాకరణము బయలుదేఱినఁగాని భాష శృంఖలలనుండి తొలఁగి బయటపడి స్వేచ్ఛావిహారము చేయ దనియుఁ గొందఱయభిప్రాయము. బాలవ్యాకరణము, ప్రౌఢవ్యాకరణము, చింతామణ్యథర్వణకారికాదులు, సమగ్రభాషానుశాసకములు కావని వారి యాశయము. అది కొంతవఱకు సత్యమే. 'ప్రయోగశరణం వ్యాకరణం' అను నభియుక్తోక్తి కలదుగదా యని యశిష్టకవుల ప్రయోగములుకూడఁ బ్రమాణముగాఁ గైకొని యనుశాసింపఁజూచుట యనుచితము. అట్టివి మన సూర్యనారాయణశాస్త్రిగారు చూపినట్లు కనఁబడలేదు. వీరీగ్రంథము చాల జాగరూకులై వ్రాసిరి. 'ముష్టీముష్టి' నుదాహరించుచు ముష్టాముష్టి యని యాంధ్రమునఁ బ్రయోగము కలదని, గీర్పతి, గీఃపతి, అనునవేగాక గీష్పతి యనికూడఁ గలదనియుఁ దెలుఁగుకవుల యపాణినీయప్రయోగములఁ బెక్కుచోట్లఁ జూపుచువచ్చినారు.

ఆప్టేనిఘంటువు, వాచస్పత్యము, కాశికావృత్తి మొదలగువాని నుండి ప్రయోగముల నొసఁగియున్నారు. ఈ గ్రంథము విద్యార్థులకేగాక విజ్ఞులనుకొనిన తెలుఁగువారికిఁ గూడ నుపయోగపడఁగలదు. దీనిని విశ్వవిద్యాలయమువారు సముచితముగా నాదరించి గ్రంథకర్తగారి పరిశ్రమము ఫలవంత మొనర్తురుగాక !

ఈ గ్రంథము వెల 3-0-0, ప్రాప్తిస్థానము. శిరోమణి, సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి, 44 జీరా. సికింద్రాబాదు (దక్కన్)

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

---

2. గోవిందరామాయణము — ఉత్తరరామచరితము.

గ్రంథకర్తలు, ఆత్మకూరి గోవిందాచార్యులు ఎమ్.ఎల్.సి. గారు శ్రీమద్రామాయణోత్తరకాండము నందలి కథావస్తువును గైకొని యటనట స్వీయాభిప్రాయములను జొన్పుచు గ్రంథకర్త లీకావ్యమును రసవత్తరముగఁ గూర్చినారు. శ్రీరామునిచరిత మొదటిచే నెన్నివిధ

ములఁ గీర్తింపఁబడినను నిత్యనూతనమై వెలయుట సహజము. తిక్కన నను కరించుటకు నిర్వచనముగఁ గైతఁ గూర్చిరి గాని యాతనితిక్క వీరి కలవడలేదు. శ్రీ గోవిందాచార్యులుగారికి రాజకీయరంగముననే గాక కవితారంగమునఁగూడ మిన్నయైన ప్రతిభ గలదని యీ కావ్యము చాటుచున్నది. శైలి ప్రాచీనసంప్రదాయానుగతమై సరళమధురమై వెలసినది. గ్రంథకర్తల కిట్టి కవితాపద్ధతి శ్రీరామమంత్రోపాసనచే లభించినట్లు లీక్రింది పద్యమునఁ దెలిపియున్నారు.

చ. అనుపమమంత్రబీజముల కక్షరమాలయుఁ బూర్ణమాలచే
ననుదినమున్ జపింతు నిను నయ్యది మొత్తము సప్తమాలయున్
దినమున కొక్కపద్యముగతిన్ సమకూర్చితి సువ్రతుండనై
నిను దనియింప నీకృతిని నీవె గొనందగు జానకీవరా!

అని యిట్టికృతిని శ్రీరామున కంకిత మొనర్చియున్నారు. ఇందైదాశ్వాసములు నూతనపద్ధతి కెక్కినవి. 1. విహారాశ్వాసము. 2. వియోగాశ్వాసము. 3 సుతోదయాశ్వాసము. 4. నిర్గమనాశ్వాసము. 5. పునస్సంయోగాశ్వాసము. వీనిలో నిర్గమనాశ్వాసములో, సీతాశపథప్రసంగమున శ్రీరాముని మానవాతీతునిగఁ బ్రదర్శించుటకై నీకవివరేణ్యులు విశేషప్రయత్నము నూని సఫలులైనారు. శ్రీరామునితత్త్వము నచట దృష్టాంతపురస్సరముగ వాకొనియున్నారు రచయితల కీఘట్ట మాదరాస్పద మనిపించుచున్నది. ఆప్రసంగముననే తమకుఁగల గంభీరాశయములనిగూఢముగ వ్యక్తము చేసియున్నారు. సంస్కృతాంధ్రసాహిత్యరంగములఁ బ్రసిద్ధులైన పండితు లీగ్రంథముపైఁ దమ సదభిప్రాయముల వెలువరించియున్నారు. నేఁటిదినములలో నిట్టి సలక్షణమయిన గ్రంథము వెలువడుట యాంధ్రభాషామతల్లి కమూల్యాభరణము లభించుట యని తలఁపనగును. వలయువారు గ్రంథకర్తలపేర వ్రాసి పడయఁగలరు. మూల్యము 2-0-0.

లక్షణదీపిక - గౌరన.

వ్యాకరణవిద్యాప్రవీణ, విద్వాన్, చిలుకూరి పాపయ్యశాస్త్రి.

ఆంధ్రమున 'హరిశ్చంద్రచరిత్రము, నవనాథచరిత్రము' అను సుప్రసిద్ధములయిన ద్విపదకావ్యములను రచియించిన గౌరనయే యీ 'లక్షణదీపిక' అను సంస్కృతచ్ఛందోగ్రంథమును రచియించిన కవివరేణ్యుఁడు. ఈతఁడు తొలుత నీలక్షణదీపికను, ఆవెనుక హరిశ్చంద్రచరిత్రమును, పిమ్మట నవనాథచరిత్రమును రచియించిన ట్లీక్రింది వాక్యముల వలనఁ దెలియుచున్నది.

హరిశ్చంద్రచరిత్రము ప్రారంభమున "సరససాహిత్యలక్షణవిచక్షణుఁడ" అనియు, తుదిని

"భ్రమరాప్రసాదసంప్రాప్తకవిత్వ
సుమహితసామ్రాజ్యసుఖపరాయణుఁడు
చతురసాహిత్యలక్షణచక్రవర్తి"

అని తన్నుఁగూర్చి యాతఁడు తెలుపుకొనియున్నాఁడు. వివిధ సాహిత్యగ్రంథములందలి ప్రయోగములతోఁగూడిన యీలక్షణగ్రంథ నిర్మాణముననే యాతని కీర్తి లక్షణచక్రవర్తిత్వము స్థిరపడియుండు ననుట నిర్వివాదము.

ఇఁక నవనాథచరిత్రారంభమున—

"ఇప్పుడుగల సుకవీంద్రులలోన
సరససాహిత్యలక్షణవివేకముల
సురుచిరమధురవచోవిలాసముల
గుణశీలములను సద్గుణకలాపముల
నలవడ్డవాఁ డెవ్వఁడని విచారించి"

తన్ను రావించెనని తెలిపెను. ఇట్లనుటచే నవనాథచరిత్రమును నిర్మించునాఁటి కీతనికి లక్షణదక్షతయు సురుచిరకావ్యనిర్మాణచాతురియు

నలవడినట్లు విదితమగుటచే నట్టి ప్రసిద్ధి సుప్రసిద్ధహరిశ్చంద్రచరిత్రమును రచించుటవలననే గలిగియుండె ననుకొనవచ్చును. కావున నుపలబ్ధమైన యంతవఱకు నాతనికృతులలోఁ దుది గ్రంథము నవనాథచరిత్రమును, తొలుతటిది లక్షణదీపిక యనియు మనము దెలిసికొన ననువగుచున్నది.

నేఁటివఱ కీలక్షణదీపిక ముద్రితముగా లేదు. విమర్శకు లందఱు నిందలివిషయముల నుదాహరించునపుడు వ్రాఁతప్రతుల నాతఁ గొని యున్నారు. కారణకాలనిర్ణయాదికమున కీగ్రంథము మిక్కిలి తోడ్పడు నదిగ నున్నది. ఆవిషయమును గ్రమముగఁ దెలిపెదను. కాని ముందుగ గ్రంథమాతృకలనుగూర్చి కొంత వివరించెదను.

పరిషద్భాండాగారమున 'లక్షణదీపిక' తాటియాకుప్రతులు రెండు గలవు. అం దొకటి 2585 సంఖ్యగలది. రెండవది 1391 సంఖ్యగలది. రెండును సమగ్రములే. ఇందలివిషయములను దెలుపునపుడు క్రమముగ వీనిని 'క' 'గ' ప్రతులని వ్యవహరింతును. ఈప్రతులందలివిషయములకుఁ బోలికలు మార్పులు పెక్కులు గలవు.

రెండిటికిఁ గలపోలికలు.

1. శ్లో. ఏషా లక్షణదీపికా విజయతే విద్వజ్జనానన్దినీ
    ఛందోఽలంకరణాద్యనేకవివిధగ్రంథప్రయోగాన్వితా
    గర్వాఖర్వకుతర్కకర్కశకవిగ్రీవాస్పదా సంశ్రిత
    వ్యాళీ సత్కవిరాజకల్పలతికా కల్పాంతరస్థాయినీ.
   అను నీశ్లోకము తుదిని రెండిటను గలదు.
2. లక్షణస్వరూపమును దెలుపు వాక్యములును, ఉదాహరణశ్లోకములును గొన్నిపట్టుల రెండిట నొకరీతిగనున్నవి.
3. రెండిటఁ జేర్కొనిన లక్షణగ్రంథములు కొన్ని తుల్యముగ నున్నవి.
4. చాలవఱకు ఛందోవిషయములు సమముగ నున్నవి.
5 లక్షణస్వరూపనిర్ణయము రెండిట సంస్కృతభాషయం దున్నది.

రెండిటికిఁ గల భేదములు.

1. ఉపక్రమోపసంహారములు వేఱ్వేఱుగఁ గన్పట్టుచున్నవి. అనఁగా 'క' ప్రతికిఁ బ్రారంభమున

శ్లో. జానకీముఖపద్మార్కం జానకీకుచభూషణం
జానకీరమణం వందే జగతాం మంగళప్రదం.
వందే వామస్తనన్యస్తవల్లకీవాదనోత్సుకాం
వక్త్రాబ్జవాసనాలోలభృంగిసంగీతమాతృకాం.
అస్తి ప్రశస్తావనిపాలమౌళి
రత్నావళీరంజితపాదపీఠః
రేచర్లవంశాన్వయపూర్ణచంద్రో
మహాబలస్సింగయమాధవేంద్రః.
ఆసీత్తస్య మహామాత్యః స్వామికార్యధురంధరః
పోతరాజ ఇతి ఖ్యాతో రాజనీతియుగంధరః.
మంత్రిచూడామణేస్తస్య సోదరస్యాయ్యలుప్రభోః
గౌరనార్య ఇతి ఖ్యాతస్తనయో నయకోవిదః.
సోఽహం సోమకళామౌళిప్రసాదాద్గతకల్మషః
ప్రణమ్య పింగళం నామ కవిపుంగవముత్తమం.
ఉదాహరణరత్నాని లక్షణగ్రంథసింధుషు
సమాకృష్య సతాం భూత్యై ప్రవక్ష్యే లక్షణదీపికామ్.

అని కలదు.

'గ' ప్రతికిఁ బ్రారంభమున

"శ్లో. ప్రణమ్య విద్వజ్జనపారిజాతం
కవీంద్రవిప్రార్చితపాదపంకజమ్
విభుం ప్రభుం విశ్వసృజం మహేశమ్
సంవక్ష్యతే లక్షణదీపికేయమ్.

అస్య, గద్యపద్యప్రబంధానాం ఛందోలక్షణనియామకస్య గ్రంథ స్యాదా తావ త్ప్రకారః కథ్యతే." అని కలదు.

'క' ప్రతికిఁ దుదిని—

"ఇతిలక్షణదీపికాయాం ప్రబంధలక్షణం సంపూర్ణమ్" అని కలదు.

'గ' ప్రతికి తుదిని—

"ఇతివితరణవిజితవినుతపారిజాత పోతనామాత్యసహజాత చాతుర్యధుర్య శ్రీమదయ్యలుమంత్రిశేఖరగర్భరత్నాకర రాకాసుధాకర గౌరనార్యవిరచితాయాం లక్షణదీపికాయాం మాతృకాపూజావిధానంనామ పంచమః పరిచ్ఛేదః" అని కలదు. ఇట్టిగద్య లీప్రతిలో ప్రతిపరిచ్ఛేదము తుదినిఁగూడఁ గలవు.

2. 'క' ప్రతియందు పంన్రెండు ప్రకాశములు.
   'గ' ప్రతియం దైదు పరిచ్ఛేదములు.
3. 'క' ప్రతిలో ప్రకాశములతుదినున్నగద్యములవలనఁ గవివంశాదికమునుగూర్చి తెలియకున్నను, ప్రారంభమునందలి శ్లోకములవలనఁ నది తెలియుచున్నది.
   'గ' ప్రతిలో గ్రంథారంభమునఁ గవివంశాదికము వర్ణింపఁబడకున్నను, పరిచ్ఛేదాంతగద్యములవలన నాయంశము దృఢముగ విశదమగుచున్నది.
4. 'క' ప్రతిలో సంస్కృతసాహిత్యచ్ఛందోగ్రంథములు మాత్ర ముదాహరింపఁబడినవి.
   'గ' ప్రతిలో సంస్కృతాంధ్రచ్ఛందోగ్రంథములు రెండును నుదాహరింపఁబడినవి.
5. 'క' ప్రతిలో వర్ణోత్పత్తిమొదలుగ మాతృకాపూజనాంతముగల ఛందోలక్షణములును, ఉదాహరణాదిప్రబంధలక్షణములును వర్ణితములు.

ఆక్రమ మిట్లున్నది.

శ్లో. వర్ణానా ముద్భవః పశ్చాత్ వ్యక్తి స్సంఖ్యా తతః పరం
భూతబీజవిచారశ్చ తతో వర్ణగ్రహావపి
అనర్థానర్థ వేధశ్చ రూక్షస్నిగ్ధవిచారణా
ప్రయోగనిర్ణయ స్తేషాం శుభాశుభఫలానిచ
గణానాం చాభిధానాని స్వరూపా ణ్యధిదేవతా
వర్ణ వేధగ్రహా స్తద్వ చ్ఛుభాశుభఫలానిచ
మిత్రామిత్రవిచారశ్చ నక్షత్రాణిచ రాశయః
మృతవేలగ్రహావస్థా మాతృకాపూజనాక్రమః
కర్తుః కారయితుశ్చైవ ప్రబంధానాం చ లక్షణం
వక్ష్యతే తత్ర సకలం మయా లక్షణవేదినా.

'గ' ప్రతిలో వర్ణోత్పత్త్యాది మాతృకాపూజనాంతలక్షణముమాత్రము వర్ణితము.

ఈ ట్రీప్రతులు రెండును విషయప్రతిపాదనమునఁ గొంతసామ్యమును గొంతమార్పును గలిగియున్నవి. ఎట్లయిన రెండిటిని గూడ రచియించినయాతఁడు 'గౌరన' యనియే చెప్పవగును.

ఇక మానవల్లి రామకృష్ణకవి, ఎమ్. ఏ. గారు శ్రీరంగమహాత్త్వము (భైరవకవివిరచితము) పీఠికలో నిట్లు తెలిపియున్నారు. "గౌరన లక్షణదీపికలోఁ గవిగజాంకుశమునుండి నాల్గు లాంధ్రము లుదాహరించెను. పుత్తునిలక్షణగ్రంథమునుండి యుదాహరించెనా యని సందేహము. లక్షణదీపికాప్రతులు నాయొద్దను ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునను గలవు. .... లక్షణదీపికలలో నన్నిప్రతులలో నానాల్గు పద్యములు గలవు" అని తెలిపియున్నారు.[1] ఈవాక్యములవలన శ్రీ రామకృష్ణకవిగారియొద్ద నున్న ప్రతులును, ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునందలి ప్రతులును 'గ' ప్రతిని బోలినవని యూహింప

1. చూ. శ్రీరంగమహత్త్వము. పీఠిక. పుట. iv

నగును. కోరాడ రామకృష్ణయ్య, ఎమ్.ఏ. గారు, నవనాథచరిత్రము పీఠికలో పైనుదాహరించిన 'క' ప్రతిలోని "అస్తిక్షితౌశస్త్రావనిపాలమౌళి" ఇత్యాదిశ్లోకములను, 'గ' ప్రతిలోని "ఇతివితరణవిజితవినుతపారిజా" తేత్యాది గద్యమునుగూడ నుదాహరించియున్నారు[2]. వా రుదాహరించిన విషయములనుబట్టి పై రెండుప్రతులను బోలిన ప్రతి వేఱొకటి వారికి లభించియుండెనేమో ? కాని వా రేప్రతినుండి యాయంశముల నుదాహరించిరో తెలుపరైరి. ఏది యెట్లున్నను నీలక్షణదీపిక గౌరనతండ్రినిఁ గూర్చియు, పెదతండ్రినిఁగూర్చియు బాగుఁగ దెలుపుచు గౌరనకాలమును నిర్ణయించుటకుఁ దగియున్నది.

లక్షణదీపికయందలి విషయవిశేషములు.

అముద్రితముగాన నిందలి విషయవిశేషములను బాఠకుల కెఱుఁగించుటకై కొంచె మధికముగఁ దెలుపుచున్నాఁడను.

'క' ప్రతియందుఁ గవి తెలుపనెంచిన లక్షణవిశేషములు వెనుకఁ దెలిపిన "వర్ణానాముద్భవః పశ్చాత్" ఇత్యాదిశ్లోకస్థములు.

ఇఁక 'గ' ప్రతియందు

1. వర్ణగుణదోషవిచారము.
2. నాయకలక్షణము.
3. కవిలక్షణము.
4. గణసంఖ్య.
5. గణాధిదేవతలు.
6. గణజాతివిభాగము.
7. గణస్వరవివేకము.
8. గణజాతివివేకము,
9. గణశుభాశుభకక్ష్యాదివిచారము
10. గణోద్దిష్టనక్షత్రవిచారము.
11. సజీవనిర్జీవనక్షత్రస్వరూపము.
12 దగ్ధజ్వలితధూమ్రనక్షత్రములు.
13. నక్షత్రానుకూల్యము.
14. గ్రహమైత్రీప్రకారము.
15. గణకూటప్రకారము.
16 దూరకూటప్రకారము.
17. యోనికూటప్రకారము.
18 అక్షరవిచారము.
19. అక్షరజాతివివేకము.
20. అక్షరగతులు.

2. చూ. నవనాథచరిత్రము. పీఠిక. పుట. X,XII

21. విషాక్షరవివేకము.
22. రూక్షస్నిగ్ధాస్నిగ్ధవివేకము.
23. అకారాదిక్షకారాంతవర్ణ శుభాశుభవిచారము.
24. మాతృకాపూజనము.
25. మాతృకాన్యాసప్రకారము.

అను నీవిషయము లుదాహరణములతో వర్ణింపఁబడినవి.

'క' ప్రతియందుఁ జేర్కొనఁబడిన గ్రంథములు.

1. సాహిత్యచూడామణి.
2. చమత్కారచంద్రిక.
3. శారదాతిలకము.
4. ప్రపంచసారము.
5. త్రిభాష్యరత్నాకరము.
6. వాసవదత్త
7. సాహిత్యచంద్రోదయము.
8. కవికంఠపాశము.
9. సాహిత్యరత్నాకరము.
10. బృహజ్జాతకము.
11. అమరుకము.
12. సంహితాసారము.
13. నామలింగానుశాసనము.
14. కిరాతార్జునీయము.
15. న్యాయసారము.
16. నైషధము.
17. సంహితాసంగ్రహము.
18. కవిరాజగజాంకుశము.
19. ప్రబంధదీపిక.
20. రత్నమాల.

'గ' ప్రతిలో వేర్కొనఁబడిన గ్రంథములు.

1. అలంకారసంగ్రహము.
2. కవికంఠపాశము.
3. చమత్కారచంద్రిక.
4. న్యాయసారము.
5. భరతరత్నకోశము.
6. యోగరత్నాలయము.
7. కుమారసంభవము.
8. సాహిత్యరత్నాకరము.
9. సాహిత్యచంద్రోదయము.
10. రసార్ణవసుధాకరము.
11. కవిరాజగజాంకుశము.
12. సాహిత్యచూడామణి.
13. భరతసంగీతరత్నకోశము.
14. బృహజ్జాతకము.
15. అలంకారచూడామణి.
16. శాకినీసహకారము.
17. అమరుకము.
18. అలంకారసర్వస్వము.

19. సాహసాఙ్కకావ్యము.
20. కృష్ణవిజయము.
21. మంత్రమహార్ణవము.
22. మంత్రాథర్వణము.
23. త్రివిధము.
24. ఉత్తమగండచ్ఛందము.
25. మనుస్మృతి.
26. ఋగ్వేదము.
27. మాఘము.
28. ఉత్తరరామచరితము.
29. కాలనిదానము.
30. మణిదర్పణము.
31. ఛప్పన్నము.
32. భోజరాజీయము.
33. ఫణితశాస్త్రము.
34 సంహితాసారము.
35. రత్నమాల.
36. వాసిష్ఠసంహిత.
37. సంహితాసంగ్రహము.
38 కవిగజాంకుశము.
39. నిధిప్రదీపిక.

ఆంధ్రచ్ఛందో గ్రంథములు.

1. శ్రీధరచ్ఛందము.
2. ఆంధ్రకవిగజాంకుశము.
3. గోకర్ణచ్ఛందము.
4. భీమనచ్ఛందము.
5 అథర్వణచ్ఛందము.

అనునవి.

ఇట్లీతఁడు తనలక్షణదీపికయందుఁ జేర్కొనిన గ్రంథములనుబట్టియు లక్షణనిర్మాణపాటవమునుబట్టియు నీతఁడు సాహిత్యచతురుఁడని తెలియుచునేయున్నది. ఈవిషయమును "చతురసాహిత్యలక్షణచక్రవర్తి" అను హరిశ్చంద్ర చరిత్రలోని వాక్యమును "సరససాహిత్య లక్షణవివేకముల" అను నవనాథచరిత్రలోని వాక్యమును స్థిరీకరించుచున్నవి.

గ్రంథత్రయమేకకర్తృకము.

లక్షణదీపిక, హరిశ్చంద్రచరిత్రము, నవనాథచరిత్రము అను నీ మూఁటిని రచించిన గౌరన యొక్కఁడే యనుటకుఁ దగిన యుపపత్తులను జూపుచున్నాఁడను. గౌరన తాను సింగయమాధవుని మంత్రియగు పోత

నామాత్యుని తమ్ముఁడగు అయ్యలుమంత్రికుమారుఁడనని లక్షణదీపికలోఁ బ్రారంభమునఁ దెలిపియున్నాఁడు.[3] హరిశ్చంద్రచరిత్రమునను

" సింగయమాధవక్షితిపాలమణికి
మంగళమూర్తికి మంత్రియై జగతిఁ
బొగడొందు పెద్దనపోతరాజునకుఁ
దగినతమ్ముఁడు యశోధనుఁ డయ్యలన్నఁ
జెట్టఁ బట్టంగ నోచిన భాగ్యవతికిఁ
జుట్టాలసురభికి సుందరీమణికి
ఘనుఁడు వల్లభమంత్రిగంగాంబ గోరి
కనిన పోచాంబకు గారాబుసుతుఁడ
భూతనాయక పాదపూజాభిరతుఁడ
గౌతమగోత్రుండ గౌరనాహ్వయుఁడ
సరససాహిత్యలక్షణచతురుఁడ "

నని తెలిపికొనినాఁడు.

ఇటులనే నవనాథచరిత్రమున

"ఇప్పుడుగల సుకవీంద్రులలోన
సరససాహిత్యలక్షణవివేకముల
సురుచిరమధురవచోవిలాసములఁ
గుణశీలములను సద్గుణకలాపముల
నలవడ్డవాఁ డెవ్వఁడని విచారించి
సింగయమాధవక్షితిపాలమంత్రి
పుంగవుఁడై యొప్పు పోతురాజునకు
ననుజాతుఁడగు నయ్యలామాత్యకూర్మి
తనయుఁ డుత్తముఁడు గౌతమగోత్రజుండు
భ్రమరాంబికావరప్రాప్తవిచిత్ర

౩. చూ. "అస్తిప్రశస్తావనిపాలమౌళి" ఇత్యాదిశ్లోకములు, పుట, ౩.

విమలసాహిత్యప్రవీణాధికుండు
ననఘచిత్తుఁడు గౌరనాహ్వయఖ్యాతుఁ"
దన్ను రావించెనని తెలిపినాఁడు.

ఇట్లీ మూఁడిట గౌరనవంశక్రమ మొకరీతిగనే వర్ణింపఁబడుటచే నీమూఁడు కృతులను రచియించిన యాతఁడొక్కఁడే యనుటకు సంశయము లేదు. మఱియు ద్విపదకృతులు రెండును మల్లికార్జునున కంకితమిచ్చుటచే నీగౌరన శివభక్తి ధురంధరుఁడని విదితమే. లక్షణదీపికయందును దనశివభక్తి పారవశ్యతను నీక్రిందిరీతిని దెలిపియున్నాఁడు.

"సోఽహం సోమకళావతాళి ప్రసాదా ద్గతకల్మషః
ప్రణమ్య విద్వజ్జనపారిజాతం
కవీంద్రవిప్రార్చితపాద పంకజం
విభుం ప్రభుం విశ్వసృజం మహేశం
సంవక్ష్యతే లక్షణదీపికేయమ్"

అని యీశ్వరునకే తననతుల నర్పించినాఁడు.

గౌరనతండ్రి పేరు అయ్యలామాత్యుఁడే.


గౌరనతండ్రిపేరు అయ్యలుమంత్రి యగునా? కాదా? యని విమర్శకులు సంశయించు చున్నారు.

ఈసంశయమునకుఁ గారణ మేమన హరిశ్చంద్ర చరిత్రము ప్రారంభమున "తగినతమ్ముఁడు యశోధను డెల్లమంత్రి" అనియు, తుదిని 'మతిమంతుఁ డయ్యలమంత్రి పుంగవుని' అనియుఁ బరస్పరవిరుద్ధముగ ముద్రితప్రతులందుఁ బాఠము గానవచ్చుటయే. దీనిపై శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు 'తగిన తమ్ముఁడు యశోధనుఁ డెల్లమంత్రి' అనునది దిద్దుటకు వీలులేనిది గనుక తుదినిగూడ 'ఎల్లనమంత్రి పుంగవుని' అనియే యుండనోపు నని, గౌరనతండ్రిని 'ఎల్లమంత్రి'నిగాఁ జేసినారు. దీనిపై శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు నవనాథచరిత్ర పీఠికలో హరిశ్చంద్ర ద్విపదలోని 'తగిన తమ్ముఁడు యశోధనుఁడెల్లమంత్రి' అనునది సంస్కరింప వీలులేనిదిగాఁ దలంప నక్కఱలేదు. 'తగినతమ్ముఁడు యశోధను డయ్యె

లార్య'అనిగాని,తగినతమ్ముని యశోధను నయ్యలార్య అనిగాని సంస్కరించుట దుస్సాధముగాదు అని తెలిపియున్నారు[4]. పంతులుగారు కాని రామకృష్ణయ్యగారు కాని హరిశ్చంద్ర చరిత్రము తాటియాకు ప్రతులను జూడకయే యిట్లు వ్రాసినారని యూహింపవలెను.ఏమన తాటియాకు ప్రతులందెచ్చటను'ఎల్లమంత్రి'అను పాఠమే గానరాదు. విమర్శకులకు శ్రమలేకుండ పూర్వోత్తర విరోధ మిసుమంతయు లేనట్లుగ "తగినతమ్ముఁడు యశోధనుఁ డయ్యలన్న" అను పాఠమే పెక్కు ప్రతులందుఁ గానవచ్చెడిని[5].

గౌరనకాలము.

గౌరనకాలనిర్ణయమునుగూర్చి విమర్శకు లందఱు తమతమ యభిప్రాయములను వెలువఱిచియున్నారు. వారిలోఁ బ్రధానముగఁ గొందఱి యభిప్రాయముల నెఱుకపఱిచి, పిదప నాయభిమతమును దెలిపెదను. గౌరనపెదతండ్రియగు పోతన సింగయమాధవునియొద్ద మంత్రిగా నుండెనని యాతఁడు రచించిన గ్రంథముల మూఁడిటను దెలిపియున్నాఁడు. సింగయమాధవుఁడు అనఁగా సింగభూపాలుని కుమారుఁడగు మాధవభూపాలుఁడు. రేచర్ల వంశమునం దట్టిసింగయమాధవు లిరువురు గలరు. అక్రమమిట్టిది.



4. చూ. నవనాథచరిత్రము పీఠిక. పుట. x, xi

5. చూ. పరిషద్భాండాగారము నందలి తాళపత్ర ప్రతులు. 1343, 2586,2127, 1667 సంఖ్యలుగలవి.

ఇప్పు డీకవి పేర్కొనిన మాధవభూపాలుఁడు మొదటి సింగభూపాలునికుమారుఁడగు మాధవుఁడా? లేక రెండవ సింగభూపాలుని కుమారుఁడగు మాధవుఁడా? అనుసందేహము చిరకాలమునుండి చరిత్రపరిశోధకులను బీడించుచునేయున్నది.

మానవల్లి రామకృష్ణకవిగారు శ్రీరంగమహత్త్వము పీఠికలో రెండవసింగని కుమారుఁ డీమాధవుఁడనియు, ఈతనితాత రామాయణమునకు 'రాఘవీయ'మను వ్యాఖ్యానమును రచించినట్లు,

శ్లో. శాకాబ్దే నిధివార్ధి రామశశిగే వ్యబ్దే ప్లవంగే శుభే
మాసేఽప్యాశ్వయుజే రఘూద్వహపదే ఘోరాఘవీయాహ్వయామ్
టీకా మర్థపటుప్రబోధఘటనామాణిక్యపుష్పాంజలిం
కృత్వా రాజతి రావుమాధవనృపో రామాయణస్య శ్రియే.

అను నీచాటుశ్లోకము చాటుచుండుటచేతను, దీనినిబట్టి క్రీ. శ. 1427 లోఁ దొలుతటి సింగయమాధవుఁ డుండెనుగాన, మనుమని కాలమువాఁడయిన యీగౌరన 1500 ప్రాంతములో నుండెననిరి.

కాని యీచాటుశ్లోకము రెండవ సింగయకుమారుఁడగు మాధవభూపాలునిభార్య నాగాంబిక నెలకొల్పిన శ. క. ౧౩౭౧ నాఁటి నాగారము శాసనములోఁ గానవచ్చుచున్నదిగాన రామాయణమునకు రాఘవీయవ్యాఖ్యానమును రచియించిన మాధవుఁడు మనుమఁడేగాని తాతయగు మాధవుఁడు కానేరఁడు. కావునఁ బై నిర్ణయము సరిపడదు.

చిలుకూరి వీరభద్రరావుగారు తమ 'శ్రీనాథకవి'అను గ్రంథమున గౌరనకాలమునుగూర్చి యిట్లు తెలిపియున్నారు. "హరిశ్చంద్రచరిత్ర ద్విపదకావ్యముగా రచించిన గౌరనమహాకవి తనపెదతండ్రి పోతరాజు దేవరకొండ రాజ్యాధిపతియగు సింగయమాధవక్షితిపాలమణికి మంత్రిగా నుండెనని చెప్పియుండుటచేతను, సింగనమాధవభూపాలుఁడు క్రీ. శ. ౧౪౨౩ లో రామాయణమునకు వ్యాఖ్య రచియించినాఁడని వీనిభార్యయగు నాగాంబిక రాచకొండ కుత్తరమున నాగసముద్రమను

తటాకమును త్రవ్వించి వ్రాయించిన శిలాశాసనములో నుండుటచేతను గౌరన తననవనాథచరిత్రపీఠికలో శాంతభిక్షావృత్తియతీశ్వరుని సవిశేష ముగా నభివర్ణించియుండుటచేతను 1430 ప్రాంతముననున్న పోతన కుమారుఁడైన గౌరనకవి 1450 ప్రాంతమున నుండుట సత్యమునకు విరుద్ధము కాదు[6]

వీరు తెలిపిన గౌరనకాలనిర్ణయము సరిపడుచున్నది. కాని నాగారము శాసనమునందుఁ జేర్కొనఁబడిన మాధవుఁడు దేవరకొండరాజ్యాధిపతిగాఁడు. దేవరకొండ రాజధానిగ రాజ్యమేలిన మాధవుఁడు మొదటి సింగభూపాలుని కుమారుఁడగు మాధవుఁడు. అతఁడు నెలకొల్పిన శాసనము శ. క. ౧౨౯౨ నాఁటిది గలదు. అందాతఁడు దేవరకొండ కధిపతిగా నుండినట్లు తెలుపఁబడినది. ఆతఁడు రామాయణమునకు వ్యాఖ్యానమును రచియించియుండలేదు. నాగారముశాసనమునందుదాహృతుఁడైన మాధవుఁడు రెండవ సింగభూపాలుని కుమారుఁడగు మాధవుఁడు. ఈతఁడు రామాయణవ్యాఖ్యానము రచించినట్లీశాసనమునఁ గలదు.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమశృంగార శ్రీనాథమున నిట్లు వాకొనియున్నారు.

"శాంతభిక్షావృత్తియతీశ్వరుని శాసనములు కొన్ని కర్నూలు మండలమునఁ గలవు. అతఁడు సరిగా శ్రీనాథునికాలమువాఁడే. ఆంధ్ర కవిత్వమం దాతని కత్యాదరముండెను. ఆకాలమున నామతాధీశ్వరు లంధ్రులయియుండిరేమో ? కాని యిప్పటివారు కర్ణాటకులు. శాంత భిక్షావృత్తి తనభృత్యునకుఁ గృతియిప్పించుటయే గాక తానుగూడ గౌరన మంత్రిచే నవనాథచరిత్రమును తెనుఁగుకృతి మల్లికార్జునదేవున కంకిత ముగాఁ జెప్పించుకొనియెను. నవనాథచరిత్రకారుఁడు గౌరన సరిగా

౬. చూ. శ్రీనాథకవి. చిలుకూరి వీరభద్రరావుగారు. పుట. ౨౫౦-౨౫౧.

శ్రీనాథునికాలమువాఁడు. ఆతఁడు సంస్కృతమున లక్షణదీపిక యను గ్రంథమును రచించెను.[7]

శ్రీ శాస్త్రిగారు దెలిపిన కాలనిర్ణయము సరిపడుచునేయున్నది. ఇంచుమించుగ శ్రీనాథుఁడుండినకాలములో నీతఁడుండెననుట యుక్తము.

శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు నవనాథచరిత్ర పీఠికలో నీతని కాలమునుగూర్చి యిట్లు ప్రసంగించియున్నారు. గౌరన తండ్రియగు అయ్యలామాత్యుఁడు, మాధవక్షితిపాలునకు మంత్రియైన పోతరాజు నకుఁ దమ్ముఁడు. ఈమాధవుఁడు 15 వ శతాబ్దిని రాచకొండ రాజ్య మేలిన సర్వజ్ఞసింగనామధేయుని కొడుకనియు, నాతనియొద్ద మంత్రిగా నున్న పోతరాజే గౌరనకుఁ బెదతండ్రియయినట్లును, ఈతనిచే రచింపఁబడిన లక్షణదీపికయందలి "అస్తిప్రశస్తావనిపాలమౌళి" ఇత్యాదిశ్లోకములవలనఁ దెలియుచున్నదనిరి. మఱియు, "సర్వజ్ఞసింగభూపాలుఁడని పేరువడసిన రావుసింగమహీపాలు నాస్థానమునకు శ్రీనాథుఁడు పోయినట్లును, నాతఁడు మహావిద్వాంసుఁ డగుటచే నాతని మెప్పించువిషయమున నీతఁడు కొంత జంకుకలవాఁడై 'దీనారటంకాల' ఇత్యాదిపద్యమును జెప్పి రాజసభాధిదేవతయగు శారదాంబను స్తుతించెనని ప్రసిద్ధి గలదుగదా? అట్టి సర్వజ్ఞునికొడుకగు నీసింగయమాధవనృపాలుఁడు గూడ గొప్పపండితుఁడై శాలి. శక. 1349 సంవత్సరము (క్రీ. శ. 1427) న రామాయణమునకు రాఘవీయమను నొకటీక వ్రాసెనని యాతని భార్య రచింపించిన శాసనమునందలి 'శాకాఖ్యేనిధివార్ధీ' త్యాదిశ్లోకమువలన స్పష్టమగుచున్నది. ఇట్లు క్రీ. శ. 15 వ శతాబ్ది తొలిభాగమున నున్న సింగయమాధవనృపాలునియొద్ద మంత్రిగానున్న పోతరాజునకు ననుజుఁడగు గౌరన 15 వ శతాబ్దిపూర్వార్ధమున నుండెననుటకు సందేహము లేదు. మఱియు శ్రీనాథునిచే శివరాత్రిమాహాత్మ్యమును దనభృత్యుఁడగు ముమ్మిడి శాంతయ్యకుఁ గృతియిప్పించిన శ్రీశైలజంగమ

7. చూ. శృంగారశ్రీనాథము. పుట. 274-275.

మఠాధీశ్వరుఁడగు శాంతభిక్షావృత్తిరాయఁడే గౌరనచే నవనాథచరిత్ర మును మల్లికార్జునిపేరఁ గృతిగాఁ జెప్పించుటచే శ్రీనాథునికాలము వాఁడేయని స్పష్టంబగుచున్నది."

శ్రీమద్రామాయణమునకు రాఘవీయమను వ్యాఖ్యానమును రచియించిన మాధవనాయని తండ్రియగు సింగభూపాలుఁడు రేచర్లవంశ మునందలి రెండవ సింగమనాయకుఁడు. ఈతఁడే రసార్ణవ సుధాకర మను నలంకారగ్రంథమును రచించినయాతఁడు. ఈతనికి సర్వజ్ఞ బిరుదము కల దనియు, నీతని యాస్థాని కేఁగినపుడు శ్రీనాథుఁడు 'దీనారటంకాల'ఇత్యా దిపద్యమును జెప్పెననియు శ్రీరామకృష్ణయ్యగారి యభిప్రాయము. అ ట్లీతనికి సర్వజ్ఞ బిరుదము కలదనుటకుఁ దగిన యితరాధారములను వారు తెలిపియుండలేదు. వెలుగోటివారి వంశచరిత్రమున మాత్ర మీతనికి సర్వజ్ఞ బిరుద మున్నట్లు తెలుపఁబడినది. దానిని బురస్కరించుకొని కాఁబోలు రామకృష్ణయ్యగా రట్లు తెలిపియుండిరి. ఇతర విమర్శకు లం దఱు నీరసార్ణవసుధాకర కర్తకు సర్వజ్ఞ బిరుదము లేదని ఘంటాపథ ముగ ఘోషించుచున్నారు. కాని యీసింగభూపాలుని యాస్థాని నున్న బొమ్మకంటి అప్పయార్యుఁడు తాను రచించిన అమరకోశవ్యాఖ్యలోను, సింగభూపనామాంకితముగ నలంకార శాస్త్ర్రగ్రంథమును రచించిన విశ్వే శ్వరకవి తన చమత్కారచంద్రికలోను నీరసార్ణవసుధాకర కర్తకు సర్వజ్ఞ బిరుదమున్నట్లు తెలిపియున్నారు[8]. మఱియు శ్రీమానవల్లి రామకృష్ణ కవిగారు 'ఆంధ్రులు రచించిన సంగీతరత్నాకర వ్యాఖ్యలు' అనువ్యాస మున నీసింగభూపతికి సర్వజ్ఞబిరుద మున్నట్లు సింగభూపాల విరచితమైన సంగీత సుధాకరమునందలి యీక్రింది శ్లోకము నుదాహరించియున్నారు.

---

8. శ్లో. విద్యాదైవత తాత తావకగురో సర్వజ్ఞచూడామణే......సంవాదికమ్.

చ. చంద్రిక.

జైవాతృకం బుధగురుం నిలయం కలానాం సర్వజ్ఞమూర్ధమణి మాశ్రితశుద్ధపక్షమ్,
శ్రీబొమ్మకంట్యుపపదాంకిత మప్పయార్యం సర్వేప్సితో షితసురంధ్విజరాజ మాహుః.

అమరకోశవ్యాఖ్య.

"అతిగంభీరే విషయే కతిపయవేద్యే త్విహ గ్రంథే
సమ్యగ్వ్యాఖ్యాకుశలః సర్వజ్ఞః సింహ(గ?) భూప ఏవైకః[9].

రసార్ణవసుధాకర కర్తయగు సింగభూపాలుఁడే సంగీత సుధాకర కర్తయును. కవిగా రుదాహరించిన పైశ్లోక మాగ్రంథము నందుండినచో రసార్ణవసుధాకర్తకు సర్వజ్ఞబిరుదము కలదనుట కెంతమాత్రమును సంశయింపఁ బనిలేదు.

కావున నీయంశమున శ్రీరామకృష్ణయ్యగారి యభిప్రాయము సరిపడుచునే యున్నది.

ఇఁక నీ గౌరన-సింగయమాధవుల కాలనిర్ణయమునుగూర్చి శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి షష్టిపూర్తిసంచికలోఁ బ్రచురించిన 'గౌరనమంత్రి-సింగయ మాధవుఁడు' అను వ్యాసమును నందలి కాలనిర్ణయమును బరికింతము. శర్మగారు శాసనపరిశోధకులలో నగ్రగణ్యులుగ నెంచఁబడువారు. వారేది ప్రసంగించినను శాసనాదిప్రమాణపురస్సరముగనే యుండును. వారివాక్యములు సర్వథాప్రమాణములే గాని ప్రమాదములు గానేరవు. కాని గౌరనకాలమునుగూర్చి వారు తెలిపిన ప్రమాణములు మాత్రము సరిపడనట్లు తోఁచెడిని. శర్మగారావ్యాసమునం దిట్లు వ్రాక్రుచ్చియున్నారు.

"గౌరనకాలము తెలియుటకు ముందు సింగయ మాధవునికాలము తెలియవలెను. హరిశ్చంద్ర నవనాథచరిత్రములవలన సింగయ మాధవుఁడెవరో స్పష్టముగఁ దెలియకపోయినను లక్షణదీపిక ననుసరించి యాతని వృత్తాంతము కొంత తెలియుచున్నది.

మ. సూ. షష్టిపూర్తి సంచిక. పుట 41.

శ్రీ వీరేశలింగము పంతులుగారు కాని శ్రీకోరాడ రామకృష్ణయ్యగారు కాని వెలుగోటి వంశచరిత్రమును జూచియు ప్రమాదము పాల్పడినా రదియెట్లో ? శ్రీరామకృష్ణయ్యగారు సర్వజ్ఞసింగభూపతి విషయముకూడఁ దెచ్చి ఈగౌరనమంత్రి కాలసమస్యను మరింత క్లిష్టము చేసి

9. చూ. భారతి. ధాత. సం॥ కార్తికమాసము. పుట-౬౨౩.

నారు. లక్షణదీపికా శ్లోకములం దుదాహృతుఁడయిన సింగభూపతి సర్వజ్ఞ సింగభూపతియనుట కాధారము మృగ్యము.　　పుట. 46-47.

"శ్రీ వీరేశలింగముగా రుదాహరించిన "శ్రీమతో మాధవేంద్రస్య......"యస్యామాత్య శిఖామణేః ......"శాకాబ్దేనిధి వార్ధిరామ శశిగే......" అను శ్లోకములు శాసనములోనివే......పై నుదాహరించిన మూడుశ్లోకములలో మొదటిరెండును హైదరాబాదు సంస్థానమునందలి మహబూబునగరము జిల్లా అమరవాది తాలూకాలోఁ జేరిన శ్రీశైలోత్తరద్వారమైన ఉమామహేశ్వరము దేవస్థానసమీపమున నున్న మాదానాయని శాసనములోనివి"　　పుట 47.

"ఈపైవిషయముల ననుసరించి చూచినచో ఉమామహేశ్వర శాసనమునందలి మాధవుఁడు మొదటి సింగభూపతి కుమారుఁడయిన మొదటి మాదానాయకుఁడనియు, అతడు శకవర్షములు ౧౨౯౮ (క్రీ శ. ౧౩౭౬ నాటివాడనియు, అతనికడనే గౌరనమంత్రి పెదతండ్రియైన పెద్దనపోతరాజు మంత్రిగా నుండెననియు, నాగారము శాసనమునందలి శకవర్షము. ౧౩౪౯ (క్రీ. శ. ౧౪౨౭) నాటి సింగయమాధవుడు ఉమామహేశ్వరము శాసనమునందలి సింగయమాధవునికి మనుమడనియు విస్పష్టమగుచున్నది. అట్లగుటంజేసి ఎవరియొద్ద పోతురాజు మంత్రిత్వము వహించెనో ఆసింగయ మాధవుడు శ్రీ మద్రామాయణ టీకాకారుడు కాడనియు, రూఢమగుచున్నది. పెద్దనపోతురాజు ప్రభువయిన మాధవుడు మొదటి సింగభూపాలుని కుమారుడని నిర్ధారితమైనందున ఈసింగభూధవుడు సర్వజ్ఞసింగభూపతి కాడనుటకు పెద్ద వితర్క మక్కఱలేదు.

హరిశ్చంద్ర నవనాథచరిత్రములందు గౌరన పేర్కొనిన సింగయమాధవుడు మొదటి సింగభూపతి కుమారుడయిన మాధవభూపాలుడగుటవలన గౌరనమంత్రికాలము ఇంక కొంచెము వెనుకకు పోవుచున్నది. అతడు క్రీస్తుశకము పదునాలుగవ శతాబ్ది అంతమునం దుండినట్లు నిశ్చయింపవచ్చును."　　పుట. 49.

శర్మగారు సింగయమాధవుని గుర్తించుటకు లక్షణదీపికను హరిశ్చంద్ర నవనాథచరిత్రలకంటె నెక్కుడు ప్రమాణముగఁ గైకొనియున్నారు. కాని ఆలక్షణదీపికయం దుదాహరించిన లక్షణగ్రంథములను బరికింపరైరి. గౌరన లక్షణదీపికయందు రెండవసింగభూపాలునిచే రచింపఁబడిన రసార్ణవసుధాకరమునుండియు, ఆతని యాస్థానకవీశ్వరుఁడగు విశ్వేశ్వరునిచే రచింపఁబడిన చమత్కారచంద్రికనుండియు శ్లోకము లుదాహరించినాఁడు. ఈరెండు గ్రంథముల నీతఁ డుదాహరించినపుడు వారిద్దఱకుఁ దరువాతికాలమువాఁ డని యొప్పుకొనకతప్పదుగదా? రసార్ణవసుధాకరకర్త కాలము నిదమిత్థమని నిర్ణయించుటకుఁ దగిన శాసనాద్యాధారములు లేవు. కాని యీతనితండ్రియగు అనపోతానాయని శాసనములు శకవర్షములు ౧౩౦౨ (క్రీ. శ. 1380) వఱకుఁ గానవచ్చుచున్నవి. తరువాత నీతని యాఱవపుత్త్రుఁడగు మాదానాయనిభార్య నాగాంబిక నెలకొల్పిన శాసనము శక. సం. ౧౩౪౧ (క్రీ. శ. ౧౪౧౯) నాఁటిది గానవచ్చుచున్నది.[10] ఈనడుమనున్న కాల మీసింగభూపాలుని కాల మనుకొనవచ్చును. ఈతఁ డెంతకాలము రాజ్యమును బాలించెనో స్పష్టముగఁ దెలియుట కితరాధారము లేకున్నను, రసార్ణవసుధాకరము పీఠికయందలి యీక్రిందిశ్లోకమునుబట్టి దీర్ఘాయుష్కుఁడై చిరకాలము రాజ్య మేలెనని తెలియుచున్నది.

శ్లో. అథ శ్రీసింగభూపాలో దీర్ఘాయు ర్వసుధా మిమామ్
నిజాంసపీఠే నిర్వ్యాజం కురుతే సుప్రతిష్ఠితామ్.

రసా. సుధా. ౧ విలా. 27 శ్లో.

కావున నీసింగభూపాలుఁడు క్రీ. శ. 1380 మొదలుగ 1425 వఱకు రాజ్యమును బాలించెననుకొనినను బాధక ముండఁజాలదు. అట్లగుటం జేసి చమత్కారచంద్రికారచనాకాలము క్రీ. శ. 1400 లకు పైఁబడి యుండితీరవలయును. ఆగ్రంథము నుదాహరించిన యీగౌరన కాల మంతకుఁ బూర్వమున కెట్లును బోఁజాలదుగదా.

---

10. చూ. వెలుగోటివంశచరిత్రము. అనుబంధము.

వెలుగోటివంశచరిత్రమందు మొదటిమాధవనాయనిశాసనమున పెద్దనపోతరాజునకు మంత్రిగ నున్నట్లు శ్లోకము లుండుటను, 'శ్రీ శ్రీ శ్రీ పెద్దిరాజుకొడుకు పోతురాజు వ్రాలు' అను నక్కరము లుండుటను బరికింపక వీరేశలింగముపంతులుగారును, రామకృష్ణయ్యగారును రెండవమాధవభూపాలునియొద్ద మంత్రిగ నున్నట్లు వ్రాయుట పొరపాటని శర్మగారియభిప్రాయము. కాని మాదానాయని ఉమామహేశ్వర శాసనమునకును, అందలి తుదిశ్లోకములకును సంబంధ మెంతమాత్రమును గానరాదు. పాఠకుల కాశ్చయమును దెలుపుటకై శాసనస్వరూపము నిటఁ జూపుచున్నాను.

మాదానాయుని ఉమామహేశ్వరము శాసనము.

శ్రీ గణపతయేనమః. స్వస్తిశ్రీ మన్మహామండలేశ్వర రాయగాయగోవాళ గజదళవిభాళ భుజబలభీమ ఖడ్గనారాయణ సోమకులపరశురామ సత్యహరిశ్చంద్ర శౌచగాంగేయ అప్రతిహతప్రతాపోదయ సతతహేమాద్రిదాననిరత దాచయసింగభూపతిసుతుండైన మేదినీరూపనారాయణ సింగమాంబాగర్భపుణ్యోదయ రేచర్లవంశదుగ్ధాబ్ధిసుధాకరుండైన శ్రీమాధవదేవేంద్రుండు దేవనగదక్షిణప్రాంతమందుల స్వనామాంకిత మాధవపురమందు సామ్రాజ్యోపవిష్టుండై శ్రీపర్వతోత్తరద్వారమైన మహేశ్వరదేవరమంటపము మహచ్ఛిలాసమూహానను రమ్యముగా రచియింపించి పదవాక్యప్రమాణజ్ఞులైన మాయభట్టోపాధ్యాయులను తన్నిమిత్తంబై శాసనంబు చెక్కుమని పనిచినం దదుక్తశాసనంబు.

యస్మిన్నుద్ధరతి క్షితి మ్మధురిపౌ కోలాకృతౌ సంభ్రమా
దుద్ధారస్య మితౌ వివేకవిధురా స్సర్వేపి ఖర్వాశయాః
సత్యస్థాః కలయంతి సత్య మపరం పాతాళగా స్సర్వతః
పాతాళం దిగిభాశ్చ భారవిరహాః పాయాత్సవ స్సర్వదా.
పాయా దాదివరాహస్య దంష్ట్రా మధ్యగతా మహీ
పంచమీ చంద్రలగ్నస్య కలంకస్యానుకుర్వతీ. ౧

యశఃప్రతాపౌ మూర్తౌతు దేవదేవస్య శార్ఙ్గిణః
పాయాస్తాం పరమానన్దకారిణౌ శశిభాస్కరౌ. 3
హేరంబస్య ముదం కరోతు భవతాం వక్రక్రియాకౌతుకీ
యో దంతేన నిపీడ్య నిర్జరగిరిం నిక్షేప్తుకామో రుషా
బిభ్యత్సు త్రిదశేషు తద్గీతటీ చ్ఛాయాం నిరీక్ష్యాత్మన
స్తాంభింద ప్రతిదంతివక్త్రమనసా దేవాఽభీకా...
పాతువః పద్మనాభస్య శయ్యాశేషఫణీశ్వరః
చకితేవ యతో లక్ష్మీర్ముకురో యస్య నముంచతి. ౫
పురావిరాసీత్పురుహూతభూతిః
పాదారవిందా దరవిందయోనేః
వర్ణ స్తురీయో...సిద్ధసింధు
సందోహసంతానయశోవితానః. ౬
తుర్యే తత్ర తురీయ విక్రమకథాచాతుర్యధుర్యోదయో
వర్ణో దేవపదారవిందజననా ద్భాగీరథీస్పర్ధినా
పాథోవత్పృథితప్రభావవిధినా ప్రాప్తోఽభిధాం లక్షిత
శ్శైత్య స్తేషు గరిష్ఠపుణ్యమహిమా రేచర్ల వంశోదధిః.
లావణ్యైకరస స్తథాపి మధురో భంగై ర్వివిహీనః పరం
సత్త్వాకీర్ణ నిజాంతరోఽపి నజడాసంగో నముక్తాశ్రితః
విస్ఫూర్జత్పరరాజమండలరుచిద్వేషీ నదేవాసురై
ర్యత్నైర్మథితో నచాపి మునినా పీత స్సవంశాంబుధిః.
ముక్తాఫలానాం సంభూతి ర్వంశేఽస్మిన్నితి జనశ్రుతిః
అస్మి న్వంశేతు సంభూత స్సంతాన స్సర్వకామదః
తత్రాజని జనానందీ జేతా జన్యేషు వైరిణాం
విక్రమే విజయాకారో వీరో వెన్నమహీపతిః. ౧౧
దోర్దండశాలినా యేన మండలాగ్రేణ ఖండితా
రిపుశుండాలశుండాలీ జయలక్ష్మీకచాయతే. ౧౧

తస్మా దావిరభూ దగణ్యమహిమా క్షోణీభృతా మగ్రణీ
శ్రీమాన్ దాచమనాయకో విజయశోసీరంధ్రితాశాంతరః
య స్యాసన్నిహ పక్షిణోఽపి రిపవో భిల్లా స్సదారాఅపి
త్యక్త్వాశా భువి భిక్షవో వివసనా అప్యంబరాంతాశ్రయాః
యస్యాహితానాం రహితాంబరాణాం
ప్రాప్యాంతరిక్షం పరితోంతరిక్షమ్,
తదాది నూనం భజతే నురూపం
గుణాన్వయా దంబరనామధేయమ్. ౧౩
అభూ త్తస్మాదుగ్రప్రతిమరిపురాజద్విపఘటీ
చపేటీవైదగ్ధ్యప్రథితపృథుకంఠీరవవరః
కరాల క్షోణీశక్షపితవరవక్షస్థలరమా
సమా...జగతి విజయీ సింగనృపతిః ౧౪.
యస్యోద్యత్కరదానవారివిచలత్పంకే మహీమండలే
నృత్యంతీ గతశంక మందితగతిః కీర్తి స్సపంకం పదం
బింబే చంద్రమసో విధాయ తరసా రోహత్పదంబ్రహ్మణ
స్తత్పంకాంకితదేహఏవ గగనే నూనం కలంకీ విధుః
పుత్ర స్తస్య నృసింహస్య భాతి సుత్రామవిక్రమః
అమిత్రౌఘతమోరాశే ర్మిత్రో మాధవనాయకః
అనుజో మనుజేంద్రస్యదనుజారాతిసంపదః
అన్నపోతమహీశస్య సన్నతారిమహీపతేః. ౧౫
నృసింహసంభవోయస్మా దసౌ మాధవనాయకః
అహితద్విరదారాతిబిరుదాంకయశోంబుధిః ౧౬
ధీరం తర్జనగర్జితోంబరగత స్తత్ఖడ్గధారాధర
శ్శ్యామ శ్శత్రుశిరఃకపాల కరకోరక్తోరుధారాజలః
సంతుష్టాత్మమహీప్రజః ప్రతిఫలత్సూర్యాంశువిద్యున్నిభో
భూమా దర్పితవైరిణాం ప్రతిదినం ప్రాణాంకురోద్భేదకః

ఉగ్రం సమస్తేషు రణేషు పూర్వం
తతో రమాయా రమణం రిపూణాం
ధాతార మంతే శరణాగతానాం
మన్యే త్రిమూర్తిం భువి మాధవేన్ద్రమ్. ౨౦
స ప్రద్యుమ్నబలోద్ధతో నరకజి త్సత్యానురక్త స్సదా
ధర్మైకప్రవణక్రియాపరమయాయుక్త స్సుభద్రానుజః
ఏవమ్మాధవతః పురాణపురుషా న్నాన్యో నృపో మాధవో
వైషమ్యం త్విద మస్యయ త్సఃజయే యుద్ధే సహాయాయతే
ఖాతినారాయణోదారః ఖడ్గనారాయణో నృపః
ప్రత్యక్షమపి య స్యేద మప్రమాణం యశో భువి. ౨౨
నిత్యం విష్ణుపదాలంబీ ద్విజరాజః కలానిధిః
సంపూర్ణమండలో రాజా నకలంకకథోప్యసా. ౨౩
క్షమైకాధారభూతోఽపి బాహు ర్యస్య మహీపతేః
ఛిన త్తి విమతవ్రాతశిరాంసి సతతం భువి. ౨౪
వర్ణ్యతే మహితే దానే కేన మాధవభూపతిః
యే నార్థినో నృపా భూత్వా కృతా న్నృపతయోఽర్థినః
ప్రత్యర్థిగాయగోగాళ సోఽయం సమరసాత్యకిః
శ్రీశైలవింధ్యమధ్యోర్వీమండలం పరిపాలయన్.
దత్త్యంకార్కశకాబ్దశాలిని శివే వర్షే నవే ఫాల్గునే
మాసే దాచయసింగభూపతిసుత శ్రీమాధవో భూధవః
శ్రీశైలోత్తరతోరణే భువి మహేశస్యాలయం నూతనం
పాషాణై స్సుదృఢం సురాసురనుతం గమ్య మ్ముదాచీకరత్.
నిశ్రేణ...దభంగ రసాతలమోపానమార్గం దృఢం
శైలందిత్సుమహేశ్వరస్య చగృహం శ్రీమాధవేనాతతమ్
ఇంద్రాద్యాఃకిల నిర్జరాభువివయం నోమాధవో నిర్మితా
దైవేనేతి వినమ్ర వక్త్రకమలా శ్చింతాం శ్రియ స్తేపరామ్.

మాధవో వర్ణ్యతే యేనదిలీప నలనాహుషైః
అకృతం సుకృతం యేన కృతాసుకృతినా కృతమ్.
పదవాక్యప్రమాణేషు ప్రవీణేన వినిర్మితమ్
శాసన మ్మాయసుధియా స్థేయా దాచంద్రతారకమ్.
శ్రీమతో మాధవేంద్రస్య రాజ్యాంగైకధురంధరః
మంత్రీ పోతనా మాసీ త్సర్వశాస్త్రవిశారదః.
యస్యామాత్యశిఖామణేః కవివరస్తోత్రైకపాత్రీకృతాం
మత్వా వాక్పతి రిద్ధనీతిసుభగాం వాగ్వైఖరీం లజ్జతే
సోయం పెద్దనమంత్రివర్యతనయః శ్రీపోతరాజోన్వహం
దేవస్యాస్య మహోపకారరచనాం సమ్యఙ్మదాచీకరత్.

శ్రీగిరినాథాయనమః.

సంత్వన్యేపి గిరాగిరాచ విబుధాః కత్యేషుకుక్షింభరి
క్షీబక్షీబతరత్సుభక్షణ భయత్యక్తా విరక్తాశ్రమాః
తేనర్వేనిజ...నిర్జరధునీ నీరాక్తచంద్రాతప
స్స్మేరోమానయనోత్పలోత్సవ సురాధీశో మహేశోనుకిమ్
గజాసురేంద్రకుంభకూటనాటనాతిపండితం
సురాసురేంద్రమౌళిహీరరంజితాంఘ్రి పంకజమ్
కళాధరోరగాధినాథ భూషితోత్తమాంగకం
సదాభజే మనోభవారి మంబికేశ మాదరాత్.

ఈశాసనములు వ్రాయింపవచ్చి వంగూరు తిప్పయభట్లు దేవతా స్తుతిగాను జెక్కినశ్లోకాలు ఈరెంకును.

శ్రీ శ్రీ శ్రీ పెద్దిరాజుకొడుకు పోతురాజువ్రాలు.

మన్యేమాధవమంచితాంగమహితా శాశాసితోరుప్రభం
యత్రాయిప్రకటార్థిరాగమవిధిజ్ఞై స్సృజ్జనైః కృత్స్నశః.
దత్వావసూన్యధి పత్రిణోయమరమోజానంతి సంతంజయే

యేనేంద్రమ్మహసా యమం దదళితాధం భూరిశ స్సాదయే
చక్ర బంధోయంశ్లోకః.

ఈశాసనమునఁ దొలుత నాంధ్రభాష నేయంశము సూక్ష్మముగఁ దెలుపఁబడినదో యాయంశమే సంస్కృతశ్లోకములందు వివరింపఁబడినది. తెలుఁగువచనమున బిరుదాంకితుఁడు దాచసింగభూపతిసుతుఁడు నగు మాధవభూపాలుఁడు మాధవపురమున రాజ్యమేలుచు పై శాసనమును నిర్మింపఁబూని మాయభట్టోపాధ్యాయునిచే రచింపించె నని కలదుగదా. ఆయంశ మంతయు శాసనములోని 30 శ్లోకములలో సమగ్రముగ వర్ణించి శాసనరచయితయగు మాయభట్టోపాధ్యాయుఁ డీశాసన మాచంద్రార్కముగ స్థిరపడుఁగాకయని యాశించుచు శాసనమును ముగించినాఁడు. ఇక్కడకే శాసనస్వరూపమంతయు పూర్తిగ ముగిసినది. ఆవెనుక నీపోతరాజుమంత్రినిగూర్చిన శ్లోకములు, చూడవచ్చిన తిప్ప భొట్లు చెక్కించిన స్తోత్రశ్లోకములు, పోతరాజుద్రావాలు, అను నక్కర ములు మాధవప్రశంసాత్మకమైన చక్రబంధశ్లోకమును గానవచ్చుచున్నవి. ఇవన్నియు నీశాసనమునకు సంబంధింపని యంశములే. సాధారణముగ తామ్రశిలాశాసనములలో దేవతాస్తుతి, శాసననిర్మాతయొక్క వంశావ తారము, శాసనప్రయోజనము, స్వరూపము, శాసనమురచించువానిని పేరును వెలయుచుండును. వీనిలో నేవియైనఁ గొన్ని లేకుండుటయుఁ గ్వాచిత్కముగా నుండును. కాని శాసనస్వరూపము ముగిసినపిమ్మట నాశాసనమునకు సంబంధింపని యితర వ్యక్తులప్రసంగ ముండఁబోదు. ముప్పదియవ శ్లోకముతరువాతివిషయ మంతయు నీశాసనమునకు సంబం ధింపనిదియే.

మఱియు వెలుగోటివారి చరిత్రమునఁ జూపిన శాసనపుఁబ్రతిలో ముప్పదియవ శ్లోకముతరువాత నున్న శ్లోకములకుఁ గ్రమసంఖ్య గాన రాదు. అట్లంకెలు లేకుండుటయు నీ తరువాతి శ్లోకము లాశాసనము నకు సంబంధింపనివని రూఢిగఁ దెలుపుచున్నది.

మఱియు నీవెలుగోటివంశచరిత్రమున నాయాభూపాలురకాలమును దెలుపుటకు వారివారి శాసనముల నెఱుకపఱుచుటయేగాక వారివారిపేరులతోఁ గూడిన శ్లోకములను గూడ చరిత్ర కుపయోగించుటకై సంగ్రహించి యున్నారు. ఈశాసనముతుది నున్న చక్రబంధశ్లోక మట్టిదియేగదా ? కావుననే రెండవసింగభూపాలుఁడు నెలకొల్పిన శాసనములు లభింప నందున నాతనిచరిత్రము నెఱుకపఱుచుటకై యాతఁడు రచించిన రసార్ణవసుధాకరమునందలి శ్లోకముల నాయనుబంధమున వెలువఱిచి యున్నారు. ఇటులనే నాయాభూపాలురకు సంబంధించిన సనదులను గూడఁ జేర్చియున్నారు.

ఇఁక నిచ్చట మాధవునియొద్ద మంత్రిగా నుండిన పోతరాజును గూర్చి తెలుపు పైరెండుశ్లోకములు మాధవనామాంకితములు గాన నీశాసనమున కనుబంధముగాఁ గూర్చియుండు రని తెలియవచ్చుచున్నది. లేకున్న శాసనస్వరూప మంతయు ముగిసినపిదప నీశ్లోకము లట నుండుట కేమియు నక్కఱ గానరాదు. ఇంతకును శాసనముచెక్కఁబడిన చోటికిఁ బోయి, యచ్చటి శిలలందలి శాసనాక్షరస్వరూపమును బాగుగఁ బరిశీలించి, యథార్థమును గ్రహింపనంతవఱకు నీశ్లోకముల నూతగఁగొని పెద్దన పోతరాజీమాధవునియొద్ద మంత్రిగ నుండె ననుట సాహసమాత్రమే యగును.

“హరిశ్చంద్రనవనాథచరిత్రలందు గౌరన పేర్కొనిన సింగయమాధవుఁడు మొదటిసింగభూపతి కుమారుఁ డగునమాధవభూపాలుఁడగుటవలన గౌరనకాలము ఇంక కొంచెము వెనుకకు పోవుచున్నది” అని చెప్పుచు శర్మగారు నవనాథచరిత్రమునకుఁ గృతిభర్తయైన శాంతభిక్షావృత్తి యతీశ్వరునిఁగూర్చి యించుకైనను బ్రసంగింపరైరి. ఈశాంతభిక్షావృత్తియతీశ్వరుఁడే తనభృత్యుఁ డగునమ్మడి శాంతయ్యకు శ్రీనాథునిచే శివరాత్రిమాహాత్మ్యమును గృతిగ నిప్పించినట్లు ఆమాహాత్మ్యమునందలిపీఠికాపద్యములవలనఁ దెలియుచున్నదిగదా! మాహాత్మ్యమునందుఁ

పేర్కొనఁబడినశాంతభిక్షావృత్తియతీశ్వరుఁడును, నవనాథచరిత్రమునందుఁ బేర్కొనఁబడిన యాతఁడును వేర్వేఱుపురుషు లని సప్రమాణముగ నిరూపించుటకుఁ దగిన యాధారము దొరకనంతవఱకు నిద్దఱు పురుషు లొక్కరేయని యూహించుటకు బాధక ముండదు గదా. అట్టిచో నీశాంతభిక్షావృత్తియతీశ్వరుఁడు శ్రీనాథునికి సమకాలికుఁడై క్రీ. శ. 1440 ప్రాంతమునందున్నవాఁడగును. ఆతనియనుమతిని నవనాథచరిత్రమును రచించిన యీగౌరనయు నాకాలమునాఁటివాఁడే యగు ననుటకు సంశయింప నక్కఱలేదు.

కావున, గౌరన లక్షణదీపికలో చమత్కారచంద్రికనుండియు రసార్ణవసుధాకరమునుండియు శ్లోకముల నుదాహరించుటచేతను, నవనాథచరిత్రమును శ్రీనాథునకు సమకాలికుఁ డగుశాంతభిక్షావృత్తియతీశ్వరు నాజ్ఞచే మల్లికార్జునునకుఁ గృతినిచ్చుటచేతను, పోతరాజునుగూర్చి తెలిపినశ్లోకము లాశాసనమునకు సంబంధింపని వగుటచేతను, శర్మగారనుకొనినట్లు గౌరనకాలము కొంచెము వెనుకకుఁ బోవుటకు బదులుగా ముందునకే వచ్చును. అతఁడు క్రీస్తుశకము పదునాల్గవ శతాబ్ది అంతమందుండుట యెట్లును బొసఁగదు. కావున క్రీస్తుశకము పదునేనవశతాబ్ది పూర్వార్ధమున, అనఁగా క్రీ. శ. 1400 మొదలు 1450 వఱకాతని కాలమయి యుండును.

శ్రీ నేలటూరు వెంకటరమణయ్య ఎమ్. ఏ. గారు 'గౌరన' అను వ్యాసమున నీతనికాలమునుగూర్చి యిట్లు తెలిపియున్నారు.

“సింగనమాధవుఁడును నతని మంత్రియగు పెద్దన పోతురాజును శా. శ. ౧౨౭౧ లో నుండిరని యుమామహేశ్వరశాసనమునందలి “దంత్యేంకార్కశకాబ్దశాలిని” ఇత్యాదిశ్లోకము విదితము సేయుచున్నది. మఱియు శాసనాంతమునఁ బెద్దన పోతురాజు వ్రాలు గానవచ్చుచున్నది. “ఈశాసనము వ్రాయింపవచ్చి వంగూరితిప్పయభట్లు దేవతాస్తుతిగాను చెక్కినశ్లోకాలు ఈ రెండును శ్రీ శ్రీ శ్రీ పెద్దిరాజు గొడుకు పోతు

రాజు వ్రాలు." ఇఁక సింగన మాధవుఁడును పతనిమంత్రియగు పెద్దన పోతురాజను క్రీ. శ. ౧౩౭౬ వ సంవత్సరప్రాంతమున నుండిరనుట నిస్సంశయముగదా. పోతిరాజుతమ్ముఁడగు నయ్యమంత్రియు నప్పటి వాఁడనుట నిశ్చయముగదా. అయ్యమంత్రికుమారుఁడును హరిశ్చంద్ర నవనాథచరిత్రలకర్తయునగు గౌరన క్రీ. శ. ౧౩౯౦, ౧౪౧౦ ల ప్రాంత మున గ్రంథరచనకుఁ గడంగెనని యూహింపవచ్చును. అతఁడు క్రీ. శ. ౧౪ వ శతాబ్దాంతమువాఁడగునుగాని వీరేశలింగముపంతులుగారు చెప్పి నట్లు ౧౫ వ శతాబ్దమధ్యకాలమువాఁడు కాఁజాలఁడు". శ్రీ వెంకట రమణయ్యగారి యభిప్రాయమునకును శ్రీ శర్మగారి యభిప్రాయము నకును భేదమించుకయుఁ గానరాదు.

గౌరనతండ్రిని 'అయ్యనమంత్రి' అని పేర్కొని హరిశ్చంద్ర చరిత్రమునం దట్లు సంస్కరించియున్నారు. వీరి కీపాఠ మెట్లులభించినదో? శర్మగారు నవనాథచరిత్రకృతిపతియగు శాంతభిక్షావృత్తిని బేర్కొనలేదు. వీరాతనిఁ బేర్కొనియు శివరాత్రిమాహాత్మ్యమునం దుదాహృతుఁడును, నవనాథచరిత్రమునం దుదాహృతుఁడును వేర్వేఱుపురుషు లనినారు. అట్లనుటకుఁ దగినయాధారములను మాత్రము తెలుపరైరి. శ్రీ సూర్యనారాయణశాస్త్రిగారి షష్టిపూర్తిసంచిక వెలువడి సుమారొకవత్సరము గావచ్చుచున్నది. అందు శర్మగారు తెలిపిన యుపపత్తులనే, అం దుదాహరించిన శాసనములనే యాధారముగఁ జేసికొని వీ రిట్టికాలనిర్ణయము ను జేయుటచూడ విచిత్రముగఁ దోఁచుచున్నవి.

శర్మగారి యభిప్రాయమును విమర్శించియుంటినిగాన ఆ హేతువు లచేతనే శ్రీ వెంకటరమణయ్యగారి సిద్ధాంతమును గతార్థముగఁ జేసి యింతకెక్కుడు వ్రాయనక్కఱ లేదని పాఠకులకుఁ దెలుపుచు నింతటితో విరమించుచున్నాఁడను.

చూ. భారతి. చిత్రభాను-శ్రావణము-పుట 96-100.

శ్రీవీరేశలింగకవి.

కొమాండూరి శఠకోపాచార్యులు, ఎమ్. ఏ. బి. ఎల్.

ఆంధ్రమందు సాహిత్యసాంఘికములలో నవజీవనము గల్గించిన మహనీయుఁడు శ్రీవీరేశలింగముపంతులు. ఈరెండురంగములలో నీయన సమముగ నసమానకృషిఁ జేసెను; కాని సంఘసంస్కర్త లీయన కిచ్చిన యాదరమును సాహితీకరు లింకను నీయలేదు. ఈయన వాఙ్మయసేవను బాగుగఁ బరిశీలించురచన యింకను నేర్పడలేదు. ఈవ్యాసములో నట్లు చేయ వీలులేదు; కాని సూచనామాత్రముగఁ జర్చింపఁబడును.

శ్రీ కందుకూరి వీరేశలింగము 16-4-1848 తేదిని (కీలక సం॥ చైత్రశుద్ధత్రయోదశిని) రాజమహేంద్రవరములో జనించెను. వీరిపూర్వికులు నెల్లూరుజిల్లా వారు; ఆఱువేలనియోగి బ్రాహ్మణులు, వీరు మొదట కేవలశైవులయినను, ఈయన ప్రపితామహుఁడు వైష్ణవకన్యను వివాహమాడెను; ఇట్లు పితామహుఁ డగు వీరేశలింగమునకు శివకేశవులవిషయమున ధార్మిక సమత్వమ్ముగల్గి, అది మనుమనికిని వ్యాపించినది. వీరిపూర్వికులు మహమ్మదీయరాజులక్రింద దేశపాండ్యాలుగ నుండి, జాగీరులనను భవించిరి. బ్రిటీషుపాలనలో నాయుద్యోగములతోపాటు జాగీరులును క్రమముగఁ బోయినవి అయినను దాతగారు కొంతయాస్తి సంపాదించి రాజమహేంద్రవరములో పెద్దభవనము నిర్మించి పరోపకారము చేయుచుండిరి. ఆయనకుమారులలో రెండవవాఁడగు శ్రీసుబ్బారాయుఁడు తనకొడుకగు వీరేశలింగ ము ఋదేండ్ల వయస్సున నున్నపుడే మరణించెను. కనుకఁ బెదతండ్రియగు వెంకటరత్నముగారే మనవీరేశలింగమును బెంచి విద్య చెప్పించిరి. బాల్యమునుండి కుశాగ్రబుద్ధియగు వీరేశలింగము సంస్కృతమునఁ గాళీదాసత్రయముఁ జదివి, పిమ్మట 1860 లో స్థాపితమైన (రాజమహేంద్రవరపు) ప్రభుత్వపాఠశాలలో మెట్రిక్యులేషను

వఱకుఁ జదివి, 1870 లో నాకరీక్షయం దుత్తీర్ణుఁడాయెను; పెదతండ్రి యీయనను గరణముగనో సర్కారు కచేరిలో గుమాస్తాగనో చేయుటకుఁ దలఁచెను; కనుక, ఈయన యప్పటి ప్రభుత్వపు రివిన్యూక్రిమినలు పరీక్షలకు వెడలి యందుత్తీర్ణుఁ డయ్యెను. ఆయన యప్పుడు తాత్కాలికముగ న్యాయశాఖలో నుద్యోగముఁ జేసెను; అందే స్థిరముగ నుండినచో ఆయన జీవితశక్తి చాలవఱకు నౌకరీకొఱకే వినియుక్త మయ్యెడిది. ఆంధ్రుల యదృష్టమున నట్లుకాక, ఆయన యుపాధ్యాయుఁ డయ్యెను. రాజమహేంద్రవరములోని ప్రభుత్వకళాశాలలో 1876 వ సం॥న వీరేశలింగముగారాంధ్రపండితులైరి; అప్పటినుండి యక్కడను, కొంతకాలము చెన్నపురిలోని ప్రెసిడెన్సీ కళాశాలలోను, ఆయన ముఖ్యాంధ్రపండితుఁడుగనుండి, 1904 సం॥లో నందుండి విరమించి యుపకారవేతన మొందెను. కొందఱాంధ్రోపాధ్యాయులవలెఁగాక, ఆయన కళాశాలావిద్యార్థులను గూడ భయభక్తులలోనుంచి, వారి కాంధ్రసాహిత్యమందుఁ దీవ్రాభిరుచిని సంఘసేవాసక్తిని కార్యపరత్వమును గూడఁ గల్గించెను. విద్యార్థుల నైతికప్రవర్తనము విషయమునను శ్రద్ధవహించుచు పాఠశాలలందే గాక సాయంకాలమందు సమావేశములలోఁ బాల్గొనుచు వారికి నీతిని బోధించుచుండెను. స్త్రీవిద్యవిషయమునను నాయన మార్గదర్శకులై రాజమహేంద్రవరమందుఁ గొన్ని బాలికాపాఠశాలలను నిర్వహించిరి. స్త్రీవిద్యాభివృద్ధి కాయన విశేషప్రోత్సాహ మిచ్చిరి. అప్పటికి మన దేశములో సాంఘిక దురాచారము లిప్పటికన్నఁ జాల హెచ్చుగనుండెను, గౌరవపదవులలో నుండువారును వేశ్యాగమనము మద్యపానము లంచగొండితనమువంటి దుర్వృత్తులకు లోనయి వానిని సాంఘిక మర్యాదగా భావించిరి.. ఇందులకుఁదోడు మూఢవిశ్వాసములు, అతిబాల్యవివాహము, బహుభార్యాత్వము, అమ్మవారిజాతరలు నిప్పటికన్నఁ జాలవిస్తరించి యుండెడివి. స్వార్థపరత దినదినము హెచ్చుచున్నది. పరస్పరసహాకారము క్షీణించుచుఁ గులతత్త్వమును స్వార్థపరతయును హెచ్చుచున్నవి. వీనిని

రూపుమాపుట సాంఘికక్షేమమున కెంతయో యవసర మని గ్రహించి, వీరేశలింగముగా రందుల కన్ని యవకాశముల నుపయోగించి సాంఘిక జీవనమును బరిశుద్ధముగఁ జేయుట కెంతో యత్నించిరి. సార్వజనికజీవితము నున్నతస్థితికిఁ దెచ్చుట కాయన చేసినకృషియు నధికము.

ఆయన విశేషద్రవ్యవంతుఁడు కాఁడు; ఉపాధ్యాయుఁడుగఁ దనకు వచ్చువేతనమును స్వల్పము. విశ్వవిద్యాలయమునఁ బరీక్షకుఁడుగను గ్రంథరచయితగను సంపాదించిన ద్రవ్యము నంతను నాయన ప్రజోపయోగమునకే వినియోగించెను.

ఆయన వివేకవర్ధిని, సత్యవాదిని అను వార్తాపత్త్రికలనుగూడ నడిపెను. వానిని విద్యాభివృద్ధికిని, సాంఘికనీతిని బాగుపఱచుటకును, దనయున్నత సిద్ధాంతములను జనులలో వ్యాపింపఁ జేయుటకునే వినియోగించెను. మఱియు నప్పటి కింకను వార్తాపత్త్రికలఁ జదువుట జనులలో బాగుగ వ్యాపింపలేదు. కొంతకాల మాయన ప్రత్యేకముగ ముద్రణాలయముఁ గూడ సాగింపవలసివచ్చెను. ఇట్టియుద్యమములలో నాయన యితరులకు మార్గదర్శకుఁ డాయెను. హాస్యసంజీవని, సత్యసంజీవని యను మాసికపత్త్రికలు గ్రంథప్రచురణమునకే సాగింపఁబడినవి. విగ్రహారాధనమును దొలఁగించి, యుపనిషత్తులలోఁ జెప్పిన విశ్వవ్యాపియగు నేకేశ్వరు నుపాసించుటను వ్యాపింపఁ జేయుటకును, కులవిద్వేషములను దొలఁగించి విశ్వప్రేమను వృద్ధిచేయుటకును రామమోహనరాయలు బెంగాలులో నారంభించిన బ్రహ్మసమాజము నాంధ్రప్రాంతమున వ్యాపింపఁజేయుటకును, వితంతూద్వాహములను ప్రచారమునకు రప్పించుటకును, ఆయన పూర్వాచారపరుల తీవ్రనిరోధము, సాంఘికబహిష్కారము దూషణము నెదుర్కొని సాహసముతోఁ బ్రచండకృషిఁ జేసి, కర్మవీరుఁ డాయెను. ఇట్లే పరిశుద్ధాస్తికమతవ్యాప్తికి మందిరమును వితంతు శరణాలయమునుగూడ రాజమహేంద్రవరములోను, ఇటీవల మదరాసులోను, స్థాపించి స్వయముగ నిర్వహించెను. రాజమహేంద్రవర

మందు సార్వజనిక కార్యములకై పురమందిరము నిర్మించి యిచ్చెను. అందులకుఁ దనయాస్తు లన్నిటిని దఖలుపఱచెను. తమ యుదారబోధలచే నున్నతాశయములకు బాల్యమునుండియు నాకృష్టులయిన శ్రీపీఠాపురము రాజాగారిసహాయముతో పరిశుద్ధాస్తికోన్నతపాఠశాల నిర్మించి యందులో నిరాధారులకు నాదిహిందువులకు బాలికలకుఁగూడ విద్య నుచితముగ బోధించున ట్లేర్పఱచిరి.

ఆయనప్రజాసేవను గుర్తించి ప్రభుత్వమువా రాయనకు (1893 లో) రావుబహదరు బిరుద మిచ్చిరి. ఆయన పురపాలకసంఘములో సభ్యుఁడుగను, నగరపరిశుద్ధికిని దానియభివృద్ధికిని గట్టికృషి చేసెను. ఇట్లు నిరంతరకార్యపరుఁడైనను బాల్యమునుండి సాహిత్యసేవఁ జేయుచు నీరెండుకార్యములసాధనకుఁ దోడుగ సామయికపత్త్రికలఁ బ్రకటించుచు నాయన యాంధ్రలోకమున దద్భుతపరిణామముఁ గావించెను. విశ్వవిద్యాలయమందు సభ్యులు, ఆంధ్రభాషలోఁ బరీక్షకుఁడునై విద్యాభివృద్ధికి భాషాభివృద్ధికి నెంతయో తోడ్పడెను. సాంఘికసాహిత్యరంగములందుఁ దనతరువాతఁగూడఁ దనకార్యముల నిర్వర్తింపఁజేయ నుద్దేశించి యందులకుఁ దగినశిష్యులఁ దయారుచేయుట కాయనశ్రమపడెను. ఇట్లు నిరంతరము సంఘసేవఁ జేయుచు 27-5-1919 సం॥ తేదిని శ్రీపంతులు గారు కాలధర్మము నొందిరి.

వాఙ్మయసేవ—పద్యకావ్యములు.

ఆయనసాంఘికనైతికకృషి యమూల్యమైనను శ్రీ వీరేశలింగముగారి సాహిత్యసేవయే ప్రస్తుతవిషయము. ఆయన చిన్నప్పుడే యేకసంథాగ్రాహియై ప్రాచీనాంధ్రసాహిత్యము నత్యభిలాషతోఁ జదువుచుండెను. ఒకసారి పఠించిన గ్రంథమందలి భావములు వర్ణనలు పదజాలమును, ఆయనస్మృతిఫలకమునఁ జిత్రితమై స్థిరపడుచుండెను. యువకదశయం దాయన కొన్నిసారు లష్టావధానము లద్భుతముగఁ జేసెనఁట.

విద్వత్కవుల కది సంప్రదాయముగ నుండెను. అయిన నిది ప్రఖ్యాతి కుపయోగించునే కాని లోకోపకారము గానేరదు.

ఆశుకవిత్వగ్రంథములు సారవంతము లగు టరుదు. స్థిరజ్ఞానదము సత్కార్యచోదకమునగు నదియే మంచివాఙ్మయ మని యాయన కొంతకాలమునకు నిశ్చయించెను.

బాల్యమునుండి భక్తిపరుఁడగు వీరేశలింగముగా రీశ్వరస్తోత్ర శతకద్వయముతో సాహిత్యరచన నారంభించిరి. నీతిబోధ కిట్టిశతకముల రచించుచుండిరి. తరువాతికవులును గొంద ఱేదోయవతారమునో తమ గ్రామమందలి దేవునో శతకములయంత్యపాదములందు సంబోధించిరి. (కుక్కుటేశ్వరశతకము, సింహాద్రినారసింహశతకము.) రాజమహేంద్రవరపు గోదావరీతీరమందలి మార్కండేయాలయమునకు గోపాలస్వామి గుడికి బాల్యమందు వీరేశలింగముగారు ప్రతిదినమున వెళ్లువారఁట. ఆభక్తితో నాయన మార్కండేయశతకమును గోపాలశతకమునుగూడ రచించిరి. కాని యాయన వానిని గాపాడి ప్రచురింపలేదు. వానిలోఁ గవిత్వము బాగులేదని వారు వ్రాసిరి.

ఆయన రచించినవానిలో ముఖ్యమగు ప్రబంధము "రసికజనమనోరంజనము". 16 వ శతాబ్దమున పెద్దనమనుచరిత్రముతోఁ బ్రబంధయుగ మారంభించినది. రామరాజభూషణుని వసుచరిత్ర మెక్కువ పాండిత్యప్రదర్శకముగ నున్నది. ఇవి యాంధ్రవాఙ్మయమం దమూల్యరత్నములు. పిమ్మటి యాంధ్రకవులు వీని ననుకరించుచు వ్రాయుచుండిరి. వీనిలో శృంగారము ముఖ్యరసము. ఏదియో పురాణగాథనో దానిఁబోలు కల్పితకథనో తీసికొని దానిని పెంచి వర్ణనలతో నింపుచుండిరి. ఈపద్ధతివలన రానురాను విజ్ఞానము, కథావిశేషము, భావస్వాతంత్ర్యముగూడఁ బోయెను. ఇటీవలఁ బ్రబంధములు శబ్దాలంకారములతోను, చిత్రబంధములతోను, దీర్ఘసమాసములతోను నిండుచుండెను. ప్రాచీనాంధ్రవాఙ్మయసంప్రదాయప్రకారము ననుకరించుచు వీరేశలింగముగారు

నాలుగాశ్వాసములలో నీ "రసికజనమనోరంజనము" ను రచించిరి. ఇందలి ముఖ్యకథ చిత్రాంగదయనుగంధర్వపుత్రిక నర్జునుఁడు వివాహమాడుట. సమయోచితముగ నింద్రప్రస్థాదులవర్ణనము, దేశయాత్ర, చిలుక యర్జునునకుఁ జిత్రాంగదకు మధ్య రాయబారియై ప్రేమాంకురములఁ బోషించుట, నాయికానాయకులసౌందర్యవర్ణనము ఇత్యాదులు వర్ణితములు. ఇది ప్రౌఢమై వసుచరిత్రమని పేరు నొందినది. ఇది కేవల మచ్చతెలుఁగుగ్రంథము; ఈయన నైషధము నిట్టిదే. అది పైపెచ్చు నిరోష్ఠ్యమును నిర్గద్యమును. విద్వదాషధ మనఁబడుసంస్కృతనైషధమును శ్రీనాథుఁ డాంధ్రీకరించెఁ గదా? శ్రీహర్షుఁడు మూలమం దెన్నిచోట్ల నో శ్లేషను, వేదాంతవిజ్ఞానమును, వ్యాకరణవిశేషములను జొప్పించెను.

శ్లో. అధిగత్య జగ త్యధీశ్వరా
　దథ ముక్తిం పురుషోత్తమా త్తతః
　వచసా మపి గోచరో నయ
　స్సత మానంద మవిందత ద్విజః.

ఇందు రాజుచేతినుండి హంసయొక్క విడుదలకును, ఈశ్వరుని కృపచే జీవునిముక్తికిని శ్లేష.

శ్లో. సరసీః పరిశీలితుం మయా
　గమికర్మీకృతనైకనీవృతా
　అతిథిత్వ మనాయి సా దృశో
　స్సదసత్సంశయగోచరోదరీ.

ఇందు వ్యాకరణవేదాంతవిశేషములు రెండునుగలవు. ఇట్టివి చాల చోట్ల శ్రీనాథుఁడు విధిలేక మూలమందలిశబ్దములను దీర్ఘసమాసములను వాడి చాలఁ బాట్లు వడెను. దీని ననేకు లధిక్షేపించిరి. వీరేశలింగముగారో నైషధచరితము నచ్చతెలుఁగులోనే కేవలపద్యకావ్యముగ

ప్రాసి, అందలిహల్లులలో నోష్ఠ్యములు పూర్తిగఁ దొలఁగించిరి. ఇట్టి రచన చేయుట శ్రమసాధ్యము.

ఆంధ్రముపైనఁ జిరకాలమునుండి సంస్కృతప్రాభవము హెచ్చియున్నది. మనప్రాంతములో సామాన్యులు సంస్కృతప్రాకృతపదములఁ జాల వాడుచుందురు. కూచిమంచి తిమ్మకవివంటి కొలదిమంది యెట్లో యచ్చతెలుఁగుకావ్యములు రచించిరి. ఇన్ని చిక్కులతోఁ గూడిన శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము పంతులుగారి కాంధ్రమునఁగల యఖండప్రజ్ఞకు నిదర్శనము. ఇట్టి నిర్బంధ మున్నను నిందలిచాటుపద్యములు క్లిష్టముగా లేవు. ఇట్లే వీరేశలింగముపంతులుగా రచ్చతెలుఁగు ననే భారతకథాసంగ్రహమును, గొంతవఱ కుత్తరరామాయణమును రచించిరి. శుద్ధాంధ్ర మగుటవలనఁ గొంత క్లిష్టత తప్పలేదు. ఇట్లు భావాధిక్యమునకు బదులు శబ్దవైచిత్రికై రచయితయుఁ బాఠకుఁడును గూడ శ్రమపడుచుండుట యనుచితమని వీరేశలింగముగా రంతట గ్రహించి తనయుత్తరరామాయణమును నిలిపివేసిరి.

ఈలోఁగా, ఆయనసాంఘికధోరణితోపాటు సాహిత్యదృక్పథము మాఱి విశాల మయినది. ఎన్నిసారులోఁ గర్ణతాడిత మగుభారతాదులయనువాదములును, శృంగారరసమయములై సాంప్రదాయిక వర్ణనలతో నిండుకొనినప్రబంధములును వ్యర్థములేగాక సంఘమునకు హానికరములని నవ్యధోరణి కావలె నని యభిప్రాయముగల్గినది. ఈప్రబంధములలో, ఒకరాజు, ఆయనపురము, అందలి చాతుర్వర్ణ్యము, రాజుగారిగుణములు, వేటకేఁగుట, అక్కడ హఠాత్తుగ నొకసుందరిని జూచి వలచుట, వారి దేహావయవవర్ణనలు, దౌత్యము, కొంతవిప్రలంభము, పిమ్మట సంభోగశృంగారమును, సాధారణముగఁ బ్రతిప్రబంధములోను వర్ణింపఁబడును. ఆనూపాత్రాదులవర్ణనలును, బూర్వసంప్రదాయపద్ధతినే చర్వితచర్వణములై యుండును. ఇప్పటికాలమున కుచితమైన జ్ఞాన

ము నిచ్చుచు, యథాస్థితిఁ దెల్పి, లోకానుభవముఁ గల్గించి, మనలోన మూల సంస్కరింపఁ జేయునవి కావు ఆరచనాధోరణిని బరిహసించుట కాయన 'అభాగ్యోపాఖ్యానము' అను ప్రబంధశైలిగలకావ్యమును వ్రాసెను. ఇందు రాజపురవర్ణనము, వేఁట, నాయిక, విరహము, దౌత్యము, ఇత్యాదులున్నను నన్నియు వికృతములు, వ్యత్యస్తములునుగఁ జూపఁబడినవి. ఇందుల కుదాహరణములు శైలిని జర్చించునపు డీయఁబడును.

ఆంగ్లమున పారడీ (Parody) అనఁబడునట్టి హేళనగ్రంథములు తెలుఁగులోఁ దక్కువ. కూచిమంచి జగ్గకవి చంద్రరేఖావిలాపమునకు దీనితోఁ గొంతపోలికయున్నది. వీరేశలింగముగారు శృంగారములేని కొన్నినవ్యగ్రంథములను స్వయముగ రచించినారు. వీరి పథికవిలాసమిట్టిదే. ఇది యాంగ్లకవి గోల్డుస్మిత్తువ్రాసిన (Traveller) అను పద్యగ్రంథమున కనువాదము. యూరపుఖండమధ్యమందలి ఆల్ప్సుకొండల పైనుండి యొక పథికుఁడు నలువైపులను దిరిగిచూచుచుఁ దనకు నల్దిశలను దోఁచు దృశ్యములను ననుభవములను నీపద్యకావ్యమున వర్ణించును.

ఇటులనే స్విట్జర్లండు ఫ్రాన్సు ఇంగ్లండు మున్నగుచుట్టునున్న దేశముల ప్రకృతిసంపదను జనులగుణములను గవి వర్ణించినాఁడు. కొన్ని దేశములలో సౌకర్యములు హెచ్చుగఁ గన్పించినను, ఆ యా రాజ్యపుఁ బ్రజలు సుఖులై స్వదేశాభిమానులై యుందురు. సుఖ మాత్మలోనే యుండును. బాహ్యసుఖము చంచలమని తెల్పినాఁడు. * ఇట్టి కవిత్వమాంధ్రవాఙ్మయములో నిదివఱలో నరుదు. సంస్కృతమున విశ్వగుణాదర్శములో నానాప్రాంతవర్ణనలలో దీనితోఁ గొంత పోలికగలదు. కొన్ని

---

* తెల్లముగా ధరిత్రిఁ బ్రతిదేశమునన్ మన మాత్మసమ్మదం
బుల్లములోనె కన్గొనుదు మెండెఁ సృజింపుదు మెండె యెప్పుడున్
పెల్లుగ ప్రమోదముక్షోభముల వేదన నొందక గూఢరీతితో
మెల్లఁగఁ బాఱుచుండుఁ బుడమిన్ గృహసౌఖ్యరసప్రవాహముల్.

పద్యములు సమత్వఘనతను సూచించును. 18 వ శతాబ్దిలో యూరపులోని దేశములస్థితిని జిత్రించునవి. కాని యిందులో వర్ణించిన యూరపులోని గిరినదీపురాదు లక్కడివారికిఁ దెలియునంటున, ఇందలి సారస్యమును మామూలు తెలుఁగుచదువరులకు బోధపడుట కష్టము. ఇట్లే హిమాలయమునుండి చీనాభారతపారసీకాదులనో వింధ్యమునుండి వంగ కళింగాంధ్ర మహారాష్ట్ర ఘూర్జరాదులనో వర్ణించురచన మనకెక్కువ హృదయంగమ మగును.

'కౌపరు' అను నాంగ్లకవికృతమగు 'జాన్ గిల్పిన్' అను మఱొక కావ్యమునుగూడ గీతపద్యములలో వీ రనువదించిరి. 'జాన్ గిల్పిన్' లండనులో 20 ఏండ్లుగ భార్యతోఁ గాఁపురముండెను. పెండ్లినాఁటి పండుగకు విందును మఱొక దూరభవనములోఁ జేయఁదలఁచి యతఁ డుదయమందే భార్యను పిల్లల నాయుద్దిష్టస్థలమునకుబండిపైఁబంపెను. తానుమాత్రము వేఁకకై మిత్రునిగుఱ్ఱము నెరవుతెచ్చుకొని విందులోనికని దాని మెడమీఁద బ్రాందిబుడ్లజతలు వ్రేలాడవేసి యశ్వారూఢుఁడై శీఘ్రితో స్వారి నారంభించెనఁట. అంతట సారాసీసాలు చప్పుడగుచుండుటచే గుఱ్ఱము బెదరి, గాలపుచేయుచుఁ బఱుగెత్తెను. తాను జారకుండ గుఱ్ఱపుజూలును గట్టిగఁబట్టుకొనెను. తన్నేదో దయ్యము పట్టుకొనెననుకొని గుఱ్ఱ మతివేగముతో బెదురుచు దౌడాయించెను. పాపము బ్రాందిబుడ్లు పగిలి టోపీపోయి, చొక్కాచినిఁగి చావుతప్పి కన్నులొట్ట యయిన ట్లతఁడు వీథిబాలుర తప్పట్లతో సాయంకాలమిల్లుచేరెనఁట. ఇందు స్వభావోక్తియు మృదులహాస్యమును గలవు.

పంతులుగారు కేవలము నీతిని బోధించుట కని ప్రత్యేకముగనొక పద్యగ్రంథమునుగూడ రచించిరి. భగవద్భక్తి, సత్యము, అహింస, సర్వసమత్వము, ధైర్యము, తృప్తి, అడఁకువ, విద్య ఇట్టి సద్గుణములు ప్రతివారు నలవఱచుకొనుట చాల నావశ్యకము క్షేమంకరము నని ప్రతివా

రికి బోధపడునట్లు సులభశైలిని గీతపద్యములతో నీతిదీపికను గూర్చి నారు. ఈరచన ముఖ్యముగ బాలురకెంతయు నుపయోగకరము. †

సత్యాద్రౌపదీసంవాదము ద్విపదలో స్త్రీలకు నీతినిబోధించు నది. ఇట్లు పద్యరచనలఁ జేయుచు వీరేశలింగముగా రాంధ్రనాటకములు ప్రహసనములు చరిత్రములు ఇత్యాదులు క్రొత్తరీతిగ్రంథములు రచిం పఁదొడఁగిరి. అప్పటికిఁ దెలుఁగులో నాటకములు లేవు. క్రీస్తుశకప్రారం భమునకే భాసాదులు సంస్కృతమున నాటకములరచించిరి. తరువాత గాళిదాసాదులసాహిత్య మేర్పడినది. ఆంధ్రకవులు పురాణేతిహాసములను శ్రవ్యకావ్యములను దెలుఁగున వ్రాసినట్లు నాటకములను నేఁటికి ననువ దింపలేదు. నంది మల్లయ ఘంట సింగయ్యగారలుమాత్ర మొక ప్రబో ధచంద్రోదయ మనువదించిరి. కాని వారలు దానిని తెలుఁగులోఁ బద్య

---

† గీ. విద్యవలన మిగుల వినయంబు గలుగును
విద్యచేతఁ దెలివి విస్తరిల్లు
విద్యచేతఁ గరము వెలయును యోగ్యత
విద్యలేనివాఁడు వింతపశువు.

తే. గీ. ప్రాణికోటియెడల మానని దయగల్గి
వారియందు దైవ మారయంగఁ
గర మనుగ్రహంబు గల్గియుండును గాన
హింసచేయఁగూడ దించుకైన.

తే. గీ. పాటులేక దేహపాటవం బణఁగును
పాటులేక సౌఖ్యపదవి తగ్గు
పాటులేక యొడల బహురోగములు చేరు
పాటులేని సౌఖ్యపాటి లేదు.

తే. గీ. పరుల నీవు సెట్లు వాంఛింతువో చేయఁ
బరుల కట్లు చేయవలయు నీవు
సర్వశాస్త్రములను జర్చింప దేవుఁడు
సారమైన ధర్మసరణి యిదియె.

కావ్యముగ మార్చివేసిరి. ఆంగ్లమందెన్నియో నాటకములు గలవు. 1870 సం॥ నాఁటికి ఫార్సీసంఘాదులద్వారా అన్నిప్రాంతములలోను నాటకప్రదర్శన మారంభింపఁబడెను. హిందీ బంగాళీ భాషలలోఁ గొన్ని నాటకములు వ్రాయఁబడినవి. ఆంధ్రములోను రూపకము లేర్పడవలెనని నిశ్చయించి వీరేశలింగముగారు కవిసార్వభౌముఁడగు కాళిదాసుని శాకుంతలమును 1875 లో ననువదించి 1883 లో గ్రంథముగఁ బ్రక టించిరి. తరువాతగొప్పవిద్వాంసులనుండి శాకుంతలమున కాఅనువాదము లేర్పడినవి. రమ్యమగు భాషాశైలిలోను భావసూచనలలోను కథా నిర్మాణములోఁగూడనద్భుతమని లోకవిఖ్యాతిఁగాంచిన సంస్కృతశాకుం తలముమాధుర్యమును శయ్యయు నాంధ్రానువాదములలో వేనికిని బూర్తిగలేవు. కాని కొలఁదిలోపములున్నను (తిన్నవానిలో) వీరేశలిం గముగారిదే సులభశైలిగలదై మూలమందలి సారస్యమును జాలవ ఱకుఁ దేఁగలిగినది. కనుక దీనికి మంచిపేరు ప్రచారమునుగలవు.

మేనకకు విశ్వామిత్రునివలన జనించి కణ్వమహర్షియొద్దఁ బెరుఁ గుచున్న శకుంతలను దుష్యంతమహారాజు ప్రేమించి పెండ్లియాడుట, ఈభౌతికప్రేమకు శాపవశమున మఱపుచే నంతరాయమేర్పడి వియోగ మేర్పడుట, పశ్చాత్తాపముద్వారా ధార్మికపరిశుద్ధిగల్గి,తుద కాధ్యాత్మిక శుద్ధి యేర్పడి రాజు సపుత్త్రియగు తపస్విని శకుంతలతోఁ గలియుటయు నందలి ముఖ్యకథ. శృంగారరసప్రధానమై కాళిదాసరచితమేయగు మాళవికాగ్నిమిత్రమును హర్షవర్ధనరాజరచిత మనఁబడు రత్నావళి నాటికనుగూడ వీరేశలింగముగా రాంధ్రీకరించి, యప్పుడు ప్రచురించి .రి ఈరెండును పూర్వకాలమందలి రాజవర్గ కుటుంబస్థితిగతులను వర్ణించునవి. మనోజ్ఞమగు భావములు గలవి. ఈరెంటికథలును శృంగా రగాథలే. ఈరెండును ద్రాక్షాపాకములోఁ బోషింపఁబడినవి.

ఈమూఁటినేగాక కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయనాటకము నుగూడ వీరేశలింగముగా రనువదించిరి. ఇదియొక యాధ్యాత్మికగాథ. గుణములు భావములునే పాత్రలు. మహామోహుఁడు వివేకుఁడు నన్న దమ్ములు. వీరు ధార్మిక రాజ్యాధిపత్యమునకై పోరుదురు. మహామో హుఁడు కామక్రోధలోభదంభాదుల సహాయముతో సేనలఁగూర్చి వివేకుని సేనలపైన ఘోరయుద్ధము సాగించును. కాని విష్ణుభక్తి ప్రసా దమున శాంతిశ్రద్ధాదులసాయముతో నాయుద్ధమునఁ దుదకు వివేకుఁడే గెలుచును. చిరవియోగమందున్న యుపనిషద్దేవితో సమాగమము నొంది యామె ద్వారా ప్రబోధచంద్రునిఁ బొందును. అంతట నాత్మ సాక్షాత్కార మేర్పడును. ఈకథ యద్వైతవేదాంతప్రతిపాదకము. ఇట్టి యాధ్యాత్మికభావములు మానవులవలె నటించుట, ప్రతివాని హృద యములోను ఆస్తికతకు నాస్తికతకు జరుగు సంఘర్షమును జిత్రించుట యే యిందలి యితివృత్తము. దీనినిఁ దెలుఁగులో నాటకముగ నను వదించి వీరేశలింగముగా రాంధ్రనాటకములలో విశిష్టతను గల్గించి నారు. మూఢతను నవిసీతినిఁ శాఅఁద్రోలి సంఘములో ఆస్తికతను నీతిని స్థాపించి వ్యాపింపఁజేయుట కాయన తన శక్తులన్నిటిని ధారవోసి, అందుకు సంస్కరణలను బ్రత్యక్షముగ సాగించెను. కనుకఁ దన జీవితో ద్దేశమును బ్రతిపాదించు నిట్టినాటకము నాయనపరివర్తనము చేయఁబూను ట సహజమే. దుష్టతకు యోగ్యతకు జరుగు సంఘర్షణము క్లిష్టము తీవ్ర ము నని తెల్పుట కిందులోఁ గొన్నిచోట్ల మూలములోవలె దీర్ఘసమా సములతోఁ బ్రౌఢశైలిలో వ్రాసినారు. కాని సులభశైలిలోనే సుందర మగు నైతికభావములను దెలుపు పద్యములును జాలఁ గలవు. అహం కారుఁడు మంచినడతను బ్రదర్శించుట కని యేదో యపవాదమునకై స్వభార్య నన్యాయముగ విసర్జించి పైపెచ్చు తన పరిశుద్ధిని జాటును. దంభుఁడు తాను బ్రహ్మలోకమునకు వెళ్లివచ్చినట్లును, అక్కడఁ దన ఘనతను జూచి ఋషులు లేచిరని, బ్రహ్మ స్వయముగ వచ్చి యతని

తోడకు గోమయము వ్రాసి పరిశుద్ధముగఁ జేసి, యందుపైనఁ దన్నుఁ గూర్చుండఁబెట్టినట్లును వర్ణించెను.*

ఆయన అప్పుడు కొన్ని యాంగ్లనాటకములనుగూడ దెలుఁగున వ్రాసెను. షేక్స్పియరు ఆంగ్లనాటక కర్తలందఱిలో ముఖ్యుఁడు. ఆయన రచించిన Merchant of veniceలో యూరపునందలి యూదులధన కాంక్షయు, మధ్యకాలపు యూరోపియనుల జీవితమును జిత్రింపఁబడినవి. దీనిలోఁ గొంతభాగము నాయన విసీసు 'వర్తకచరిత్ర' మనుపేర ద్విపద లోనే తెనుఁగుఁజేసెను. Comedy of errors అను షేక్స్పియరు నాటకము హాస్యరసప్రధానము. ఇందులోఁ గవలపిల్లలొకరినొకరు పోలి యున్నందునఁ గుటుంబములోఁ గల్గిన కలవరము వినోదకరముగ వర్ణింపఁ బడినది. దీని నాయన హృదయంగమముగ ననువదించిరి.

ఇట్లే యాంగ్లకవి 'షెరిడన్' రచితమగు 'డ్యూయన్నా, దిరైవల్స్' అను నాటకములను రాగమంజరి కళ్యాణ కల్పవల్లి అను పేర్లతో వీరే శలింగముగా రాంధ్రవచనములో వ్రాసిరి. ఇందలి జననగరాదుల యూరపియను పేర్లకుబదులుగ మనదేశపు పేర్లనే యుపయోగించిరి. కాని కథ మనవారిసంఘమునకు సంబంధించినది కాదు. అక్కడిసంప్రదాయములు మన జానపదులకుఁ దెలియవు. ఇవి యంతగాఁ బ్రచారములోనికి రాలేదు. మఱికొన్ని యాంగ్లనాటకములనుగూడ పంతులుగారు తెలుఁగులో వ్రాసిరి.

సశేషము.

---

*ఉ. మాత మహాకులీన మఱి మత్యతిశ్రోత్రియు పుత్త్రియాటనే
పూతుఁడు తండ్రికంటె విను పూర్వము మత్యతియన్న మిత్రుస
న్మాతులపుత్త్రిమీఁద నణుమాత్ర మబద్ధపునింద రాదను
ఖ్యాతపు బాంధవంబని ప్రియాంగనఁబోనిడి యొతిబద్ధుఁడన్. ప్రభో ౨ అం.
మునుపొకసారి బ్రహ్మపురముం గనివచ్చుట కేను బోవఁగా
మునివర లాత్మపీఠచయముం డిగి యెల్లరు నన్నుఁ జూచి, యా
వనజభవుండు నన్నుఁ బ్రియభావములఁ దేఱిచి యుద్దిగాఁ గ ది
గ్గన నుపవిష్టుఁ జేసి నవగోమయలిప్తనిజోరుపీఠికన్. ప్రభో ౩ అం.

గాక యిఁక నాకుఁ బుత్త్రుఁడవు గమ్మ నిజమ్మైన నీకు నిందు నం
డికములతోనిగాఁగఁ బ్రకటిల్లు జగంబులఁ గీర్తిస్ఫూర్తియున్. ౭౪

వ. అనిన విని, బద్మసంభవుఁడు పద్మనాభునకు నవ్వరంబు బ్రమదంబున నిచ్చి వెండియు మోహావశంబున నతని కిట్లనియె. ౭౫

చ. తలపఁగ నీవు నేనునుగదా భువనంబుల కెల్ల ముఖ్య క
ర్తల మొక తేజ మిద్దఱము దాఁకఁగ భేదము గన్నవార మ
వ్వల మనమీఁద నెవ్వఁడును వారక కల్గఁడు నీదునాకు ని
శ్చలమహిమంబు లింతకు నిజంబుగఁ జక్కని మూలబీజముల్. ౭౬

చ. అనుటయు వాసుదేవుఁడు బ్రహాసముఖుం డగుచున్ బ్రజాపతిం
గని యతిగాఢమోహమునఁ గానవు సాత్త్వికభంగి నీకు నా
కును బరము స్వదాత్మము నకుంఠము నా నవలీల నిద్రమే
ల్కనఁ దగు తత్త్వ మాహరుఁడు దేరము చెల్లునె... వాఁడున్ ?

గీ. ఏను నీవుఁ గూడ నీవిశ్వమంతయు
నామహేశ్వరుని శతాంశజాత
మగుటఁ గనుము నీను మహంకారదుర్జాత
మనుచు స్రష్ట యుదరి యతనితోడ. ౭౮

చ. మన కధికంబు లేదు నీను మాధవ చీఁటిఁ ద్రవ్వనేల నీ
వెనసిన నిద్రచేతఁ గ్రమ మిట్టిదియంచును (బల్కు) నేరవి
ట్లనకు మనర్థభాషణము లాడిన నెన్న... దదాహ్వయం
బునఁ గనఁబట్టెది... సకలమున్ సదసద్మరసానబద్ధమై. ౭౯

వ. అన విని పురుషోత్తముం డావిరించిం గాంచి, మాయాశంకరుండు మాయాశక్తి శాంకరి యట్లగుటయుఁ దదీయమాయాపాశబద్ధులు గాక యెంతటి ప్రబుద్ధులకుం దలఁగఁ బోలదు. నీవ యొక్కరుండవు ననసేల. ఏను నీకుం భాలాక్షుఁ గనఁజాలు దివ్యచక్షు లొసంగితి; తచ్చరణంబులకు శరణంబుగా నింపున భజియింపు మనుచుఁ బలుకు నవసరంబున. ౮౦

క. హరిదత్త దివ్యచక్షు
స్స్ఫురితమహిమచేత విశ్వమున నొక్కటయుర్
సరసీరుహజాతునకుం
గరబదరసమాన మగుచుఁ గానంబడియెన్. ౮౧

శా. రాకారంజకతావ...నసహస్రప్రఖ్యముఖ్యప్రభాం
గీకారంబు దలిర్పఁ దారగిరిభంగిం జాల నింపారు ర
మ్యాకారంబున బ్రహ్మ్రమోల నిలిచె న్నాపన్నరక్షాక్రమ
స్వీకారంబు ప్రయోజనం బగుట నావిశ్వేశ్వరుం డత్తఱిన్. ౮౨

క. భద్రగతి నజుఁడు గనియెను
రుద్రగణసమేతుఁ గాలరుద్రవిరచితా
క్షుద్రభజనాకృతాదర
ముద్రుని నారుద్రునిం బ్రమోదముతోడన్. ౮౩

వ. తదనంతరంబ శివసదాలోకనంబునఁ దనతామసభావంబు కొంత యు
డిగి బహువారంబులు నమస్కారంబు సలిపిన నలినజుండు కేలుమొ
గిచి యిట్లని స్తుతియించె. ౮౪

క. ప్రణమిల్లుమ నీకును లస
దణిమాప్రథిమాద్యమాద్యదష్టవిధమహా
గుణభేదానందరస
ప్రణిహితలీలాసుఖానుభవ యభవ శివా! ౮౫

మ. కరుణం జూడుము నన్ను రంగశుభరంగత్స్వాభవాఖర్వభూ
మరుదర్కానలచంద్రయజ్వవియదంభఃప్రజ్వలన్నామ సుం
దరమూర్త్యష్టక కీర్తిమానగుణసన్నద్ధప్రతాపప్రభా
పరమానంగత విశ్వధారణ దృఢవ్యాపారపారంగతా! ౮౬

క. వినుతింపనేను నేర్తునె
నిను నానావాక్ప్రపంచనిర్మాణకళా
వనికయుమామక ననవ?
ఘనికజగత్ప్రమదదాత గణనాతీతా! ౮౭

వ. అనుచు బహుభంగులఁ బ్రస్తుతించుచున్న విరించి నాదరించి, యవ్వి
భుం డభీష్టం బడుగు మనవుడుం దత్పాదంబులకు బ్రహ్మ పునఃపునః
ప్రణామంబు సలిపి, దేవా! దేవర నాయందుఁ బ్రసన్నుండ వగు
దేని భవచ్చరణభక్తిభావంబును దత్త్వబోధంబును గరుణింపవే
యన్న నతనికి నట్ల యొసంగి ఫాలలోచనుం డిట్లనియె. ౮౮

క. విను మీప్రపంచ మఖిలం
బును మన్మయ మఖిలవేదములు శాస్త్రములుం
బనుపడ మామకమహిమను
వినుతింపంబడుఁ బ్రకాశవిస్తరసరణిన్. ౮౯

గీ. అద్వయంబు నవ్యయంబు నానందము
? మఱి నిరామయంబు నిశ్చలంబు
నిర్మలంబుఁ జాల నిష్కలంకంబును
నగు మదీయరూప మనఘచరిత. ౯౦

క. ఘనమునకు ఘనము సూక్ష్మం
బునకును సూక్ష్మంబు పూర్ణమునకును బూర్ణం
బనయము నాయాకారము
వనజాసన పోల దెట్టివారికిఁ దెలియన్. ౯౧

వ. ఇట్లు నిర్గుణుండనయ్యును నాకస్మికసృష్టినిర్మాణకర్మరతిం దగిలి
సగుణత్వంబు భజియించు మదీయతేజఃకళాంశంబులు మూఁట జగ
దుత్పత్తికారణంబులుగాఁ గ్రమంబున నిన్నును, విష్ణునిం గాలరుద్రు
నిం గలిగించినాఁడ. మీమువ్వురకుం బరంబైన దైవంబనగుట నన్ను
వేదవిదులు మహాదేవుండన వెలయుచుందురు; నివ్విమలప్రకారం
బు సవిశేషంబుగా నెఱుకపఱిచితి; నింక నీవు మదాజ్ఞావశంబున
నానాప్రజ్ఞానంబున నానాప్రజల సృజియించుచుఁ జరింపుమని మ
చ్చిక నానతియిచ్చి యనంతరంబ, ౯౨

క. భాను బృహద్భాను సుధా
భానుసహస్రములకైనఁ బటు తేజమునన్
మానసగుణహరుఁ డంత
ధ్యానము భజియించె బ్రహ్మ తాఁ గన చుండన్. ౯౩

క. హరుఁడిట్లు బోధ మజునకుఁ
గరుణించిన యట్టిలీలఁ గడులోలత నె
వ్వరు లిఖియించినఁ జదివిన
నరుదుగ నిహపర(సుఖం)బు లబ్బుచునుండున్. ౯౪

మూఁడవలీల.

గీ. వినుఁడు సముచితముగ వివరింతు నిటమీఁద
నభవుఁ డవధరించినట్టి లీల
తెలుఁగు మిగుల నది సతీవివాహం బనఁ
దనరు పేరు శుభనిదానమగుచు. ౯౫

వ. ఈశానప్రసాదంబున నగాధతత్ప్రబోధవిలాసుం డగుచు నలినాస
నుం డతిప్రయత్నంబున, ౯౬

ఉ. అంబుజనాభుతోడ భవదాదరవాదమునన్ గదా యవి
ఘ్నంబున నమ్మహేశ్వరనకాశము నిక్కముగాంచితిన్ బ్రమో
దంబును దత్ప్రసాదమును దక్కక పొందితిఁ జాల సంప్రమో
దంబున నిండి తాతనియెడన్ బ్రజఁజేయుదు నింక నెమ్మదిన్. ౯౭

వ. అని సముచితంబుగా రమానాథుని వీడ్కొని, మెచ్చటిచోటిక యేఁగి,
శివునడుగులఁ దలంచి నమస్కరించి, తత్ప్రసాదలబ్ధనిర్మాణమహి
మంబున, ౯౮

గీ. ప్రియము మీఱ మరీచిని భృగువు నాంగి
రసుఁ బులస్త్యుని బులహు(ని)ఁ గ్రతువు మఱియు
దక్షు నత్రిని వశిష్ఠుఁ దనదు భావ
మునఁ దలంచి సృజించె నా వనజభవుఁడు. ౯౯

క. అనవసూనులత్తోడన
నానావిధ(మైన)వర్తనలు గలప్రజలం
గా నటు రచింపఁ దొడఁగెను
జానారఁగ నజుఁడు సహజచతురత మెఱయన్. ౧౦౦

వ. ఇట్లు దొడంగి సురయక్షగంధర్వాదులను, శరభసింహగజాశ్వాదులను, మేరుహిమవన్మాల్యవంతగంధమాదనాదులను, దేవతిర్యఙ్మనుష్యస్థావరాత్మకచతుర్విధభూతసృష్టిం గడమపడకుండ సృజియించి, మెండియు నుచితంబగుజ్ఞానకలనం జెలంగి, పనులు సమకట్టుచుండె; నంతకమున్న యక్కడ నీశ్వరుండును నుత్తరపుదిక్కున ననుత్తమశుభాయత్తమహామోదంబును, సుధావిరచితమహిమంబును, శైలాన్వయవిలాసంబును నగుకైలాసంబునకుఁ గలుగు ననన్యసామాన్యశృంగారంబు గాంచి, యది తనకు విహారణాగారంబు గావించి, యచ్చటన నివసించె. ౧౦౧

శా. ఆకైలాసము, పూర్ణచంద్రశతలక్షాలక్షణీయక్రమా
లోకవ్యాసము, నిర్జరోద్గతమరుల్లుప్తాత్యజాతాప్సరో?
లోకాయాసము, నీశదర్శనసదాలోకాభియాతామరా
నీకోల్లాసముఁ బ్రస్తుతింపఁదగు నున్నిద్రప్రభావాసమున్. ౧౦౨

సీ. విషధరభోగాప్తవితతలక్షణముల
నీయద్రి మాంధాద్రి నెనయుననుచు
చంద్రభూషణశయస్ఫారజృంభణముల
నీయద్రి వేదాద్రి నెనయుననుచు
నంధకారవిహ్వదాకర్షంబున ?
నీయద్రి పూర్వాద్రి నెనయుననుచు
గంగావతంసప్రకాశవిభ్రమమున
నీయద్రి (తుహినాద్రి) నెనయుననుచు

గీ. నహరహంబును గాలత్రయజ్ఞులగు మ
హాత్ములతిభక్తిఁ గొనియాడ నభవభావి

దివ్యలీలను దెలుపు నదీర్ణ మహిమఁ
దారగిరిసొంపు వినుతింపఁ దరముగాదు. ౧౦3

క. క్రిందును మీఁదును మేరకు
నందుకొనఁగరాక దివ్యమగు తేజమునం
గ్రందుకొనుచు నన్నగమున
కొందును శంకరభవిష్యగురులింగ మనన్, ౧౦౪

సీ. శుకములు శుకముఖప్రకటయోగీశ్వరా
గమ్యశివజ్ఞానకాంతమతులు
నీలకంఠంబులు నీలకంఠపదాబ్జ
సంతతకీర్తనస్వచ్ఛమతులు
హంసముల్ హంససంజ్ఞావిధేయామేయ
హరతత్త్వ నిర్ణయాయత్తమతులు
మానసౌకంబులు మానసౌకఃపర
మేశ్వరధ్యానసమిద్ధమతులు

గీ. వేయునేటికి వాక్రువ్వ వివిధజంతు
పుం...త్రికాలజ్ఞానకలనఁ జెలఁగి
శంభు నెఱుఁగనియవి లేవు సకలవిమల
పుణ్యలీలల నయ్యగభూములందు. ౧౦౫

సీ. అమృతరసాహ్వాయ...సంధాయ
కామలతోయముల్ హ్రదములెల్ల
బాలసహస్రాంశు భావాభిరామాంశు
బహుమణిప్రాంశువుల్ గృహములెల్ల
పురుహూతహృదయోరుపూరితహృచ్చారు
పూర్ణలక్ష్మీరుచుల్ పురములెల్ల
భరితేశగుణసార్థభవ్యోపనిషదర్థ
కలనాకృతార్థముల్ పలుకులెల్ల

గీ. ననిశనవయౌవనలు జలజాక్షు లెల్ల
జనితకల్పకములు గలవనము లెల్ల
కామధుగ్ధేనువులు పసికదుపు లెల్ల
కరముఁ జెన్నొందుఁ గైలాసపురమునందు. ౧౦౬

క. అన్నగరమణి సుభగ సం
పన్నగరీయఃప్రశస్తమహిమలు క్రమలీ
లన్నభివర్ణన సేయఁగ
నన్నలినాసనునకైన నౌఘళ మరయన్. ౧౦౭

సీ. శివు దివ్యనామసంస్మృతు లహరహమును
భక్తిఁ గావించు సత్ప్రౌఢులకును
అసమాక్షునవ్యయపదాబ్జంబు లెడపని
శుద్ధిమైఁ బూజించు సూరులకును
భవు నవ్యయాకారు భావన లాసక్తి
యుక్తిమైఁ బాలించు యోగ్యులకును
నఖిలేశు దివ్యలీలావలు లత్యంత
బుద్ధికై శీలించు పుణ్యులకును

గీ. వరుసభవబంధములు ... ...నపుడు
వినుతబహుమాన్యసంపద లనుభవింపఁ
దగినతానకమగుట నుదారవస్తు
భరిత మగుచుండు నెపుడు నప్పురవరంబు. ౧౦౮

వ. అమ్మహానగరం బురుభాగ్యంబు వడసి నిర్మలధర్మనిర్మాణకర్మకన
త్ప్రకారదాలయవిలసనంబును దీర్ఘతరానర్ఘ్యప్రశస్త వజ్రస్తంభభరిత
సంభారజృంభితగంభీరవచనంబును, సముత్తుంగశృంగాగ్రసంగతశాత
కుంభకుంభోరుదివ్యఘృణితాంబరమణిబంధురీకంబును, చిత్రవర్ణలసత్పతా
కావల్గదభిరామధ్వజారామప్రసూనాయమానతారకానీకంబును, స
ర్వదాఖర్వహృత్పర్వకిసలయప్రసవఫలప్రకరభరానమ్రకమ్రశాఖాను

ఖావహవిటపిపటలసమావృతంబును, ప్రసిద్ధసిద్ధరహస్యపరిపూర్ణ వాటికాకూపపరిసరంబును, నాతిహైమోష్ణతానిష్ణాతగుణోత్తరాభి నవసురభిగంధవహనధురంధరమంధరగంధవాహవిభ్రమణంబును, సకలవిదిఙ్ముఖద్వారసము దాత్తతోరణసారశిఖావిలిఖితగగనంబునునగుచుఁ బరమేశ్వరుండు విహరించు దివ్యహర్మ్యంబు తేజరిల్లుచుండు.

సీ. తమవాఁడిచూపులు దర్పకు క్రొవ్వాఁడి
తూపుల కొనవరి ప్రాపు లగుచుఁ
దమపల్కురీతులు దర్పకువిజయసం
గీతుల కలరు సజాతులగుచుఁ
దమమందహాసముల్ దర్పకు కీర్తివి
లాసంబులకు సముపాసములుగఁ
దమహావభావముల్ దర్పకులీలాప్ర
భావములకు మూలజీవములుగ
గీ. వఱలు శృంగారమంత్రదేవతలకరణి
నతిమనోహరమోహనాకృతులు గలిగి
శాంభవీసర్వసత్పరిచారసరణి
నెసఁగుచుండుదు రందుఁ బూర్ణేందుముఖులు. ౧౧౦

క. సర్వాదికుటుంబినికిని
శర్వాణీపతికి నిలువ సముచిత మగుటన్
సర్వాంకమశోభనదృ
క్పర్వము తద్గృహవరంబు ప్రణుతింపఁ దగున్. ౧౧౧

వ ఇట్టి రామణీయకంబునం గనుపట్టిన యామహనీయనగరంబు నిజాలయంబుగా నట్లు పరిగ్రహించి యందు నుదంచితవిభవంబున,

సీ. విష్ణ్వాదు లవిరళవేదార్థగోచర
వాచాదివిధుల సంస్తవము చేయ
నింద్రాదు లహరహం బీప్సితానుల భక్తి
ఘనకళావిధుల సేవనలు పూన

నారదాదులు దార నానాజయాభోగ
రమణీయవిధుల గీతములు వాడ
రంభాదు లభినవరసభావవిభ్రమ
దర్శనవిధుల నర్తనలు సూప
గీ. నవ్యయానంద నిష్యంద దివ్యసుఖద
కేళిఁ జరియింపుచును జగజ్జాల మరసి
మొలిఁ బాలింపుచును దయాలీల వెలసి
హరుఁడు ప్రొద్దులు పుచ్చుచు నతిశయిల్లె. ౧౧౩
వ. అంతకుమున్న యిక్కడ నంబుజాసనుండు తనచేత సృజియింపఁబడిన ప్రజలెవ్వరు నభివృద్ధినొందక పుట్టినట్లయుంటం జేసి, నితాంతదుఃఖాయమానమానసుండగుచు నార్తరక్షణతత్పరుండగు పరమేశ్వరు గుఱించి ఘోరతపం బాచరించిన. ౧౧౪
ఉ. అతఁడు దారభూధరమహోత్తరశృంగమువిూఁద నంకర
మ్యాతతహేమవల్లరులయందమునం దనమూర్ధసీమఁ బ్ర
స్ఫీత పిశంగమంగళరుచిం గరపల్లవతల్ దలిర్పఁగా
నాతని ప్రోల నిల్చె మహిమామృతసద్గరిమశరవ్వఁ డున్నతిన్. ౧౧౫
క. ఆయభవున కానందమ
యాయతవిభవున కపాయహరణకళాసం
ధాయకునకు విశ్వజగ
న్నాయకునకు వినుతి సలిపె నలినాసనుఁడున్. ౧౧౬
గీ. నిటలతటలసత్కరపుటఘటితవదనుఁ
డగుచు భారతీవల్లభుఁ డలరు వేడ్క
శాంభవీభర్త భువనసంజననభరణ
హరణగుణకర్త నిట్లని యభినుతించె. ౧౧౭
క. భగవన్ భవశరణం భవ
జగతాం బహిరంతరాత్మ సదసత్కలనా
దిగుణసగుణస్వభావ
ద్విగుణితనామప్రభావ విమలితభావా ! ౧౧౮

క. పాలయ కృపాలయాత్మక
పాలయ మా మార్త మార్యపరిరక్షణపీ
ఠ్ఠాలఘుజిఘృక్షుహుతభు
గ్భాలక్ష్యవిలక్షణీయ ఫాలాక్ష! విభో! ౧౧౯

క. త్వామితి కలయామి పునః
స్త్వా మిహ కలయాను భర్గ సకలోకనిమ
న్నామానం సతతాక్షయ
ధామానం సుప్రసన్నతాభామానం. ౧౨౦

గీ. అనుచుఁ దనుఁ బెక్కుభంగుల నభినుతింప
విని దయానిధి యావిశ్వవిభుఁడు పలికె
నేమి మదిఁ గోరి సలిపితి విట్టితపము
వేఁడు మది యిత్తు పద్మజ వేడ్కతోడ. ౧౨౧

వ. అనిన బ్రహ్మక్రమ్మఱఁ బ్రణతుండగుచు, దేవా! దేవరయానతి నవ
ధరించి నానాప్రజల సృజియించినాఁడ. వార లందఱు నొకయిం
తయుఁ బ్రవర్ధనంబు నొందరు. తద్వృద్ధిహేతువుగా నానందరసకాసార
హేతువును, భవన్మనోహరయునగు శాంకరి నియోగించి, యస్మదభి
మతంబుగాఁ బూజించి యనుగ్రహించి యవధరింపవలయుననిన విని
యాజగత్ప్రభుం డాత్మ నాభంగి నంగీకరించిన యించుకతడవునకుఁ
దద్వామభాగంబున. ౧౨౨

సీ. ఏశక్తి యుత్పత్తి నెఱుఁగక యిపుడును
శ్రుతులు నానాక్రమాగతులఁ బొగడు
నేశక్తి యనుస్మృతి నెసఁగు నిర్గుణుఁడయ్యు
హరుఁడు గుణోదారసరణి మెలఁగు
నేశక్తి విస్ఫూర్తి నేతత్ప్రపంచమం
తయు సవశ్వరలీలఁ దనరి మెఱయు
నేశక్తి నిజమూర్తి నేలి భారతియాది
గా శక్తిగణ మెల్లఁ గలిగి వెలయు

గీ. సట్టి యసమశక్తి యసమమంగళరాజ
ధానియగుచుఁ బొగడఁదగు భవాని
నిలిచె నుదయశిఖరకలితార్కశతలక్ష్మి
వినుతభంగిని మెలఁగును లతాంగి. ౧౨౩

క. గిర్వల్లభుఁ డంత నిజా
ఖర్వకిరీటస్థరత్నఘనరోచుల కా
శర్వాణి పదమరీచుల
గర్వం బెసఁగంగ నెరఁగి కలితాంజలియై. ౧౨౪

క. ఎల్లారిఁ బ్రోవఁ గరుణం
బెల్లారిన కల్పవల్లి ప్రియకరలీలా
సల్లాలిత యనఁదగు శివు
నిల్లాలి వధూమతల్లి నీశ్వరిఁ గొలుతున్. ౧౨౫

క. వాణియనఁ బద్మయన రు
ద్రాణి యనఁగ నొక్కతె యని రసగీతిం గీ
ర్వాణీవందితయగు భ
ద్రాణీమహిమాచలంబ నంబన్ గొలుతున్ ? ౧౨౬

వ అని మఱియు నజుండు బహుభంగుల సంస్తుతించి, తత్ప్రసన్నతం గాంచి,
మాయా ప్రజారక్షణార్థంబుగా మామకపుత్త్రిండగు దక్షునకు హృద
యానందనిధిగా నవతరింపుమనుచు విన్నవించు సమయంబున, ౧౨౭

క. హరుఁకును మోహమునఁ జిఱునగ
వరుదారుచుఁ దొంగలింప సభలేశ్వరి నీ
శ్వరిఁ జూచి యజునికోరిక
భరితోకృపం జలుప మనకు భారం బనుచున్. ౧౨౮

చ. అనుటయు సర్వమంగళయు నర్మిలి వారిరుహాసనుం గనుం
గొని నిజభక్తమాత్రులకుఁ గోర్కులు...మునిత్తు నెప్పుడుం
బనుపడ నా తనూజుఁడవు భక్తుఁడవున్ మఱినీవు నీకు నే
న నితరభంగి నీప్సితసుఖార్థము లీఁగి వచింప నేటికిన్. ౧౨౯

1. నొక్క- యయుదారస

క. అదిగావున దక్షునకుం
బదిలపుఁగృపఁ దనయ నగుదుఁ బంకజభవ! నె
మ్మదిఁ జని వివిధప్రజలన్
విదితక్రమనిపుణలీల విరచింపవయా! ౧౩౦

వ. అని యన నిటలాంబకుండును ననుకంపావలోకనమతి వాక్పతిఁ బ్రజానిర్మాణకర్మంబునకు వీడుకొలుప నవధరించి తిలకించినఁ బ్రమోదంబున నుమాసహితుండగుచు, నుచితవినోదంబులఁ బ్రొద్దుపుచ్చుచుండె; నంత నక్కడ భారతీశ్వరుండును శాంకరీశంకరులవలనఁ బ్రసాదంబు వడసి చతుర్విధభూతసృష్టిప్రకారంబు ప్రపూర్ణంబుగా నలవరించుచుఁ గృతార్థత నుండు సమయంబున. ౧౩౧

ఉ. తామరచూలి వేఁడినకతంబున దక్షున కుద్భవించె లీ
లామహనీయమంగళవిలాస విభాసభవాని హృద్యవి
ద్యామయరూప గాఢరచనావనభావనిరూఢదేవతా
రామవసంతవేళ యభిరామదయారస బాల యున్నతిన్. ౧౩౨

క. అందముగన్నా...నిజ
నందనకు స్సతియనంగ నామం బిడితా
నందంద మఱియుఁ బలువురు
సుందరులం బడసెఁ బ్రియము సొంపెసలారన్. ౧౩౩

వ. ఇట్లు దక్షునకుం బెక్కండ్రు కూఁతులు గలిగి యందఱు నమంద లీలావిలాసంబులకు నివాసంబులగుచు మవ్వంబు మిగిలి జవ్వనంబునం దుదిముట్టి; రట్టియెడ వారలలోఁ దారలలోపలనున్న చంద్రమండలి యుంబోలె ననూనకళామహితయుఁ జంద్రాహ్లాదవిధానసహితయు ననం దనరి యతిశయింపఁ జక్కఁదనంబునం గ్రాలె నావరవర్ణిని చెలువంబు వర్ణింప శక్యంబుగాదు; నా నేర్చినభంగిఁ గొంత వివరించెద.

క. సదమలమార్దవమున కా
స్పదములు నవపద్మరాగపద్మరుచులకుం
బదములు మిగులం గమిఘో?
పదములు దక్షాద్యతనయపదములు జగతిన్. ౧౩౪

క. తారల యలఘుసితప్రభ
తారలఁ దెగడుచును రాజితపుజంఘల శ్రీం
గారముల నగుచు విభ్రమ
పారములన నొప్పుచుండు సతిపదనఖముల్. ౧౩౬

గీ. సర్వమంగళ మీఁగాళ్ల చక్కఁదనము
తమకుఁ బడయంగరాక పోకమఱము...
మెనయఁజాలక తల యెత్తుకొనఁగలేక
బయలు మెఱసి చరింపవు భయముకతన. ౧౩౭

క. వెడవిలుతుదొనలు తమకును
వెడవెడఁ గడలనఁగ నలఘువిలసనములలోఁ
గడలుకొను దత్సుదతి చిఱు
తొడలబెడఁగుఁ బాగడఁ జాలుదురె యెవ్వారల్. ౧౩౮

క. అరసిన వెలుపటి వెంబయు
పొరపొచ్చెము లోపలెల్ల పొసఁగద యను నీ
శ్వరి యందము లగు నూరులు
గరిమంబున నొప్పుఁ గదళికాస్తంభములన్. ౧౩౯

గీ. అఖిలవందనీయ మగునుమాజఘనమం
డలముఁ బోలె నొప్పఁ పులినచయము
పద్మభవుఁడు వఱద పాలుగా నూఱక
తమ్ముఁ జేసెననుచుఁ దలఁపకున్నె. ౧౪౦

క. నవలావణ్య రసోదధి
భవమనఁగను...పరిపలితవళీ
సవిధలహరీవిజృంభణ
తవిలి వనితనాభి శోభితస్థితి నలరున్. ౧౪౧

క. కలదనఁగా లేదనఁగాఁ
గలమాటల రెంటి నడుము గాఁబట్టి సుమీ
చెలువ చెలువారు నడుముకుఁ
గలిగె న్నడుమనఁగ నామకంబు విశదమై. ౧౪౨

గీ. ఉపరిఁ దనదు ... చరోరుభయంబున
ననదుఁగాను తిరుగునంచుఁ దలఁచి
... ...
... ... ౧౪౩

క. [1]వనజాత సదృశనేత్రికి
స్తనములకుఁ బయోధ (రాభిధానముఘన) భా
వనిరూఢియుఁ గలమీఁదను
ఘనతకలిమియందుఁ దలఁపఁగా నద్భుతమే. ౧౪౪

క. నవకల్పద్రుమలతికల
నవరదనముఁ దెగడు దక్షసంభవకరముల్
శివకరములు నగు లోక
స్తవనీయగుణాకరములు తథ్యం బరయన్. ౧౪౫

గీ. సప్రవాళము...లసత్ప్రవాళములకు
నభయమిచ్చి సుందరారవింద
రుచులఁ గొల్లవెట్టి ప్రచురవిభ్రమమునఁ
బరఁగు నవ్వధూటి పాణియుగము. ౧౪౬

క. శంబరరిపుజనులీలా
డంబరమగు కంబువున విడంబరముగ నీ
యంబుజముఖి కంఠంబున
యంబు జగన్నుతవిలాస మలవడఁ దాల్చెన్. ౧౪౭

క. అద్దంపు జిలుగు పలువున
నిద్దపు శశిబింబరుచులు నెఱినిడి పోవం
దద్దయు మిఱుంగుఁ దామర
యద్దక్షజముఖము చెలువు నభివర్ణింపన్. ౧౪౮

గీ. వరుసఁ గరకబీజ వజ్రముక్తాఫల
కుందకోరకముల యందమెల్లఁ

1. వనజాతాసన.

జాఱఁగొని మెనఁగ సుందరివిశదదం
తములు ప్రస్తుతింపఁ దరమె యెందు. ౧౪౯

క. చిఱునగవుచేత నొసపరి
కెమ్మెఱ పొక్కటి గలిగి యలరునోష్ఠద్వయ మా
తెఱవకు నరవిరి నడుమం
జఱగలిఁగొనునట్టి చిగురుజాతికిఁ బ్రతియై. ౧౫౦

క. శ్రీకారంబుల మించు ము
దాకారంబుల ఘటించు దర్పకువిజయ
ప్రాకారంబు లనందగు
నాకారంబులశ్రుతిద్వయంబులు సతికిన్. ౧౫౧

గీ. వేస... ...వజ్రహేమపుష్ప
ముల విజృంభణలక్ష్మి నపహరించి
యనితరప్రభాతి నాసయున్నతి?
ఘ్రాణవిలసనంబు గ్రాలుచుండు. ౧౫౨

క, సంగతి త్రిభువనమోహన
మంగళవిభవంబు గలిగి మనమాఱటఁ బో
ల్పంగదిదియితరములన?
నంగజుతూపులకుఁ బ్రాపు లంగనచూపుల్. ౧౫౩

క. అష్టమదినశశిశకలనా
స్పష్టవిలాసంబుఁ జూపు ఫాలము జగదు
త్కృష్టదరహాసభావా
క్లిష్టగుణోన్నతికి సతికి లీలాసరణిన్. ౧౫౪

గీ. కించిదాకుంచితంబును సంచితమును
నగుచు దాక్షాయణికి నొప్పు నలకభరము
ప్రకటలావణ్యలక్ష్మికిఁ బట్టినట్టి
బెడఁగువిరాజిన జగజంపుగొడుగువోలె. ౧౫౫

క. నీలముల శాతమన్యవ
నీలంబులకరణిఁ గుటిలనిరుపమలీలా

వాలంబు లమరుఁ జమరీ
వాలంబులకరణిఁ జంద్రవదనకచంబుల్. ౧౪౬

క. అలవడు లనదలగతులం
గలహంసంబులకు బొమ్మగట్టుచు మిగులం
జెలువుల గుతియ్యఁబలుకులఁ
జిలుకల నగు నాసితాక్షి చిత్రస్ఫురణన్. ౧౪౭

చ. నవరదనంబు లెల్లను బొసంగఁగ నొక్కెడఁ జూచువేడ్క వా
గ్భవుఁడు సమాపదార్థసముదాయములన్నియుఁ దెచ్చి దక్షసం
భవ నొనరించెఁ గాక తిలఁవన్నది యెట్టిద గాక తక్కినన్
నవతియ లేక యీసతియ చానలలోఁ బ్రకటిల్లుచుండు నే. ౧౪౮

వ. అని యిట్లు పెక్కుతెఱంగులం గొనియాడఁదగిన విలాసవిభ్రమం
బుల విలసిల్లుసమయంబున. ౧౪౯

ఉ. ఆ రుచిరాంగిఁ జూచి యానయంబును దక్షుఁడు నెమ్మనంబులో
నీరమణీలలామమున కిష్టగతిం బ్రతివచ్చునాథు నే
నారసి యేక్రియం బరిణయం బొనరింపఁగ గాంతునంచుఁ బె
ల్లారు విచారసాగరమునందు మునుంగుచునుండె నంతటన్, ౧౫౦

గీ. నలువపాలికి నేఁగి సన్నుతులు సలిపి
వినయముగఁ గేలుమోడ్చుచు విన్నవించె
సతికి నాయగ్రపుత్రికి మతిఁదలంచి
యవధరింపుఁడు వరుఁ జెప్పఁ డబ్జగర్భ! ౧౫౧

క. అనిన విని బ్రహ్మ యాద
క్షున కనియెం దావకాగ్రసుత కఖిలజగ
జ్జననికి వరుఁ డనఁగాఁదగు
ననఘుఁడు జగదేకజనకుఁ డభవుఁడు పుత్రా! ౧౫౨

వ. కావునఁ దత్ప్రకారంబున కుచితవ్యాపారంబు నలుపుమని పనిచినం
జని, యతండును దపంబునందక్క నాపని చేవడదని ధ్రువంబుగా
నిర్ణయించి, యొక్కపుణ్యాశ్రమంబు నధిగమించి, అతిశయితనిరతి

పరిషత్పుస్తకభాండాగారము.

మూఁడవభాగము—లక్షణగ్రంథములు.

ఆంధ్రసాహిత్యపరిషత్తు.

ఆంధ్రసాహిత్యపరిషత్తు,
కాకినాడ.

1942
ప్రతులు 500.
కాకినాడముద్రాక్షరశాల,
కాకినాడ.

వెల. 0—8—0

పరిషత్పుస్తకభాండాగారము-మూఁడవభాగము.

లక్షణగ్రంథములు.

విషయసూచిక.

మూఁడవభాగము.

ఆంధ్రవ్యాకరణాలంకారగ్రంథములు,